
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
మంగళవారం 22 ఏప్రిల్ 2025

ఉష్ణోగ్రత (అంచనా)

22-4-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	41	26
తెనాలి	39	26
నరసరావుపేట	40	25
బాపట్ల	37	27
రెంటచింతల	42	25

కొలిక్కి వస్తున్న రీ సర్వే



- తప్పులు సరిచేస్తూ...సమగ్రంగా
- పైలట్ ప్రాజెక్టుగా గతంలోనే మండలానికో గ్రామం
- రెండో విడత కూడా ప్రారంభం
- ఇప్పటికే గ్రామ సభలు పూర్తి.. హద్దులు గుర్తింపు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వం రీ సర్వే పేరిట చేసిన ప్రహసనం భూములకు మరిన్ని చిక్కులు తెచ్చిపెట్టిందే తప్ప రైతాంగానికి ఒనగూరిన ప్రయోజనం గుండుసున్నా. ప్రణాళికలు లేకుండా చేపట్టిన రీ సర్వే తంతుతో ప్రభుత్వం మారగానే ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో అర్జీలు ప్రభుత్వానికి అందాయి. వీటిలో అధికశాతం భూ సంబంధమైనవే కావడం గమనార్హం. దీంతో ప్రస్తుత ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో పక్కా ప్రణాళికతో మండలానికి ఓ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి రీ సర్వే నిర్వహించింది. ఈ గ్రామాలన్నీ కూడా గత ప్రభుత్వంలో రీ సర్వే చేయనివే కావడంతో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా రీ సర్వేని యంత్రాంగం చేపట్టింది. కోర్టు పరిధిలో ఉన్న భూ వివాదాలు మినహా రీ సర్వే ఓ కొలిక్కి వచ్చేసరికి ఆయా గ్రామాల్లోని రికార్డుల్లో ఎలాంటి తకరారు లేకుండా పక్కాగా ఆర్‌వోఆర్ ఉండాలనేదే ప్రభుత్వ ఉద్దేశం. దీనికి అనుగుణంగానే ఎంపిక చేసిన గ్రామాల్లో ఇప్పటికే జీటీ పూర్తి చేసిన యంత్రాంగం 9(2) కింద గ్రామాల్లో ఉన్న భూ యజమానులందరికీ నోటీసులు జారీ చేసి అభ్యంతరాలను స్వీకరించింది. వాటిని డిస్పోజ్ కూడా చేసింది. డీఎల్‌ఆర్ అంకాన్ని కూడా ముగించిన యంత్రాంగం చివరిగా ఆర్‌వోఆర్ సిద్ధం చేసి గ్రామాల్లో జాబితా ప్రదర్శించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రక్రియ అంతా కూడా దాదాపుగా ముగింపుకొచ్చింది. ఆ తర్వాత రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ వివాదం అనే మాటే వినిపించకూడదనేది ప్రభుత్వ అంతిమ లక్ష్యంగా ఉంది. దీనికి అనుగుణంగా రీ సర్వేని పక్కాగా చేపట్టడానికి ఆ విధుల్లో ఉన్న సిబ్బందికి వేరే డ్యూటీలు వేయకుండా అన్ని వసతులు సమకూర్చి పూర్తి పారదర్శకంగా రీ సర్వే జరిగేలా ప్రభుత్వం తోడ్పాటునందించింది

రెండో విడత రీ సర్వే ఇప్పటికే ప్రారంభం

ప్రభుత్వం దశల వారీగా అన్ని గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేయాలన్న ఆలోచనలో ఉంది. దీనిలో భాగంగానే పైలట్ గ్రామాల్లో రీసర్వే కొలిక్కి వస్తుండగానే గుంటూరు జిల్లాలో 18, పల్నాడులో 28, బాపట్ల జిల్లా పరిధిలోని 25 గ్రామాల్లో ఈ నెల 2 నుంచి మలివిడత రీసర్వే ప్రభుత్వం ప్రారంభించింది. ఇప్పటికే గ్రామ



రెండో విడత రీ సర్వేలో భాగంగా వేటపాలెం మండలం దేశాయిపేటలో నిర్వహిస్తున్న గ్రామ సభ (పాత చిత్రం)

సభలను పూర్తి చేసిన యంత్రాంగం హద్దులను గుర్తించే ప్రక్రియ వేగంగా చేస్తోంది. తొలుత మండలానికి రెండు గ్రామాల చొప్పున రెండో విడత రీ సర్వే చేపట్టాలని ప్రభుత్వం తలంచింది. దీనికి అనుగుణంగానే తొలుత ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం ఇటీవల మండలానికో గ్రామంలోనే రీ సర్వే చేపట్టే విధంగా ఆదేశాలను సవరించారు. సిబ్బంది తక్కువగా ఉండడంతో పాటు కచ్చితత్వంతో కూడిన ఫలితాలను రాబట్టాలనే ఉద్దేశంతో రెండో విడత రీ సర్వే గ్రామాలను కుదిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పైలట్ గ్రామాల్లో ప్రభుత్వం ఎంచుకున్న నమూనా సత్ఫలితాలు ఇవ్వడంతో అదే ప్రక్రియలో మొత్తం భూములకు రీ సర్వే చేపట్టి భూ యజమానులకు భరోసా అందించే దిశగా ప్రభుత్వం అడుగులేస్తోంది. ఇదిలా ఉంటే రెండో విడతలో మూడు జిల్లాలో ఎంచుకున్న 71 గ్రామాల్లో వైసీపీ హయాంలో రీ సర్వేని ప్రారంభించి సగంలో కాడి వదిలేసిన 35 గ్రామాలను కూడా జాబితాలో సర్వే విభాగం చేర్చింది. ఇప్పటికే పైలట్ గ్రామాల్లో రీ సర్వే విజయవంతం కావడంతో పాటు ప్రభుత్వం ఎంచుకున్న నమూనా, యాప్ వినియోగంపై సిబ్బందికి ఓ అవగాహన వచ్చింది. దీంతో రెండో విడత కింద ఎంచుకున్న గ్రామాల్లో రీ సర్వే ఘట్టాన్ని పూర్తి చేయడానికి ప్రభుత్వం కేవలం రెండు నెలల సమయం మాత్రమే ఇచ్చి ఫలితాలు చూపెట్టాలని ఆదేశించింది. గడువులోపల రీ సర్వే పూర్తి చేయాలనే పట్టుదలతో యంత్రాంగం అడుగులేస్తోంది

అభ్యంతరాల విషయంలో ఏకాభిప్రాయంతోనే..

రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో వచ్చే అభ్యంతరాలకు సంబంధించి ఇరు పార్టీల అంగీకారంతోనే ఓ నిర్ణయానికి వస్తున్నామని సర్వేతో పాటు రెవెన్యూ విభాగం చెబుతోంది. అప్పటికీ ఒప్పుకోని పక్షంలో సహేతుకతలేని వినతులని తిరస్కరించి ముందుకు వెళుతున్నామని అధికారులు చెబుతున్నారు. మరింత సంక్లిష్టంగా ఉన్నవాటి విషయంలో రాష్ట్రస్థాయి అధికారుల ఆదేశాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు. వైసీపీ హయాంలో రీ సర్వే జరిగిన అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 11,000 అర్జీలు

(మిగతా 6వ పేజీలో)

తెల్లబోతున్న జొన్న



మొన్నటి వర్షాలకు తడిచిన తెల్ల జొన్నలు

కృష్ణా పశ్చిమ డెల్టాలో రబీ సాగుకింద పండిన మొక్కజొన్న, జొన్న పంటలు చేతికొచ్చాయి. పంట అందుతున్న తరుణంలోనే వర్షాలూ వెంట వచ్చాయి. తడిచిపోవటం, పంట దెబ్బతినటం వంటివన్నీ ఒకెత్తయితే, పంట చేతికొచ్చినా అమ్ముకోలేని స్థితిలో రబీ రైతన్న ఉన్నాడు. ఒక్క మాటలో చెప్పాలంటే పండించిన పంట కొనే దిక్కులేక అల్లాడుతున్నాడు. జొన్నకు ప్రభుత్వం ఇచ్చిన మద్దతు ధర ఆకాశంలో ఉంటే, మార్కెట్‌లో ఉన్న వాస్తవ ధర పాతాళంలో ఉంది. అంటే... మార్కెట్ ధరకు, వ్యాపారులు కోతకోసి మరీ కొంటున్న ధరకు అంత వ్యత్యాసం ఉందన్నమాట. మొక్కజొన్నకు కొంత వరకు పర్వాలేదనిపిస్తున్నా, జొన్నరైతే దిగాలు పడుతున్నాడు. పెట్టుబడులు కూడా రాక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. కష్టకాలంలో ఆదుకోవాల్సిన పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖలు తాము జొన్నలు, మొక్కజొన్న కొనబోమని ఆలస్యంగా కబురు చెప్పటంతో జొన్నరైతన్నది దిక్కుతోచని స్థితి. పండించిన పాపానికి ఎంతోకొంత దక్కితే చాలని వ్యాపారులు, దళారులను ఆశ్రయిస్తే వర్షాల సాకుచూపి, తేమ ఉందని, రంగు మారిపోయాయంటూ మద్దతు ధరలో సగమే ఉన్న రేటు మరింత కోత కోసి రైతన్నను దగా చేస్తున్నారు. దీంతో పెట్టుబడులుకూడా దక్కక రైతన్న దిగాలు పడుతుంటే, కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

ధర లేదు... కొనే దిక్కూలేదు

- మొక్కజొన్న కూడా చేలల్లోనే అమ్మకాలు
- కొనుగోలు కేంద్రాల ఊసే ఎత్తని మార్కెటింగ్ శాఖ
- వర్షాలకూ దెబ్బతిని బోరుమంటున్న జొన్నరైతులు
- రంగు మారటంతో రేటు విషయంలో కోతకోస్తున్న వ్యాపారులు
- జొన్న మద్దతు ధర రూ. 3460... మార్కెట్ రేటు రూ. 1700లే
- అంతా దగానే... ఆదుకోకుంటే రైతన్నకు నష్టమే



తెల్ల జొన్నలను గోతాలకెత్తుతున్న కూలీలు

తెనాలి, వేమూరు, ఏప్రిల్ 21, (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టాలో 5.71 లక్షల ఎకరాలు సాగవుతుంటే, వాటిలో రబీ కింద మొక్కజొన్న, జొన్న, మినుము, పెసర పంటలు సాగయ్యాయి. వీటిలో మొక్కజొన్న, జొన్న పంటల సాగే ఎక్కువగా ఉంది. జొన్న 3.9 లక్షల ఎకరాల్లో సాగయితే, జొన్న 1.3 లక్షల ఎకరాల్లో సాగయిందనేది అధికారుల మాట. మిగిలిన విస్తీర్ణంలో మినుము, పెసర పంటలు వేశారు. అయితే వీటన్నిటికీ రేటు కొంత వరకు పర్వాలేదనిపించినా, తెల్లజొన్నకు మాత్రం దారుణంగా ఉంది.



దీంతో రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అయితే మొక్కజొన్నకు మాత్రం మార్కెట్ రేటుకూడా మద్దతు ధరకు దగ్గరగా ఉండటంతో రైతులకు పెద్దగా నష్టం జరిగేదిలేదు. క్వింటా మొక్కజొన్నలకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ. 2,225గా ఉంది. అయితే మార్కెట్‌లో క్వింటాకు రూ. 2,100 నుంచి రూ. 2,200 వరకు వ్యాపారులే చెల్లిస్తుండటంతో రైతులు పెద్దగా కొనుగోలు కేంద్రాలకోసం ఎదురు చూడటంలేదు. శనివారం బాపట్ల జిల్లాలో క్వింటాకు ఖర్చులతో రైతులకు పనిలేకుండా రూ. 2120 రేటు చెల్లిస్తే, ఖర్చులతో రూ. 2,200 చెల్లించారని, దీనివల్ల పెద్దగా ఇబ్బందిలేదని, చేలల్లోనే వ్యాపారులు మద్దతు ధరకు దగ్గరగా ఇచ్చి కొంటున్నారని చెబుతున్నారు.

మద్దతు ధర రూ. 3,460... కొనేది రూ. 1700లకే

జొన్న డెల్టాలో 1.3 లక్షల ఎకరాల్లో సాగయితే దిగుబడి కూడా ఆశించిన స్థాయిలోనే వచ్చింది. ఎకరాకు 25 నుంచి 28 క్వింటాళ్ల వరకు దిగుబడులు రైతులకు దక్కాయి. కొన్ని చోట్లయితే 30 క్వింటాళ్లు కూడా వచ్చాయి. అయితే జొన్న మద్దతు ధర క్వింటాకు భారీగానే కేంద్రం నిర్ణయించింది. దీనిలో తెల్లజొన్న హైబ్రిడ్‌వయితే క్వింటాకు రూ. 3,371, మాల్దండి రకం జొన్నకయితే రూ. 3,421గా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మద్దతు ధర కేవలం కాగితాలకే పరిమితమయింది.ప్రస్తుతం అంతా బాగున్న జొన్నలయితే క్వింటాకు వ్యాపారులు రూ. 2100 వరకు చెల్లిస్తున్నారు. అయితే ఎక్కువ శాతం సాకులుచూపి ధరలో కోత కోసేస్తున్నారు. తడవకుండా, మంచుకు రంగు మారినా, వర్షాలకు తడిచాయన్న సాకులు

(మిగతా 6వ పేజీలో)

ఇసుక తవ్వకాలకు.. అనుమతులు

- 2.50 లక్షల టన్నుల ఇసుక నిల్వ చేయండి
- కలెక్టర్ అరుణ్‌బాబు




సమావేశంలో కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ సూరజ్

నరసరావు పేట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : కృష్ణానదిలో ఇసుక తవ్వకాలకు పర్యావరణ అనుమతులు లభించాయి. రీచ్‌లలో ఇసుక తవ్వకాలు ప్రారంభించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన ఇసుక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 1 కల్లా జిల్లాలో 2.5 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను స్టాక్ పాయింట్లలో నిల్వ చేయాలని సూచించారు. వెనువెంటనే ఇసుక నిల్వ చేసేందుకు స్టాక్ పాయింట్లను గుర్తించాలన్నారు. అన్ని స్టాక్ పాయింట్లలో ఇసుక నిర్వహణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక రీచుల్లో ఇసుక తవ్వకాల కోసం ఏజెన్సీల నియామకం ప్రక్రియ ప్రారంభించాలన్నారు. దిడుగు -1 రీచ్‌లో ప్రయోగాత్మకంగా నామినేషన్ విధానంలో ఏజెన్సీని నియమించాలని చెప్పారు. నామినేషన్ విధానం ఫలితాన్ని బట్టి మిగిలిన రీచుల్లో ఏజెన్సీల నియామకంపై నిర్ణయం తీసుకుంటామన్నారు. 5 ఇసుక రీచులలో అక్టోబరు వరకూ తవ్వకాలు చేపట్టేందుకు పర్యావరణ శాఖ నుంచి అనుమతి లభించిందన్నారు. దీంతో 3.10 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకానికి అందుబాటులోకి వస్తుందన్నారు. అంబడిపూడి - 1,2,3, కోనూరు -1 రీచ్‌ల్లో అక్టోబరు 22 వరకు, దిడుగు -1 రీచ్‌లో డిసెంబరు 30 వరకూ ఇసుక తవ్వకాలకు అనుమతి లభించిందన్నారు. సదరు రీచుల పర్యవేక్షణకు ఇంచార్జులను నియమించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా మైన్స్, జియాలజీ అధికారి నాగిని, ఆర్డీవో రమణా కాంత్ రెడ్డి, జిల్లా రవాణా అధికారి సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శివారు.. పట్టించుకోరూ..



సుందరయ్య కాలనీలోని రోడ్డు దుస్థితి



ఇందిరమ్మ కాలనీ ఏరియల్ వ్యూ

- మౌలిక వసతులే ప్రధాన సమస్యలు
- దుస్థితిలో పిడుగురాళ్ల శివారు కాలనీలు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు, పాలకులు ఎందరు మారినా అక్కడ మాత్రం అభివృద్ధి మచ్చుకైనా కనిపించడం లేదు. ఎన్నికలకు ముందు చేసిన వాగ్దానాలలో కొన్ని మాత్రమే పూర్తిచేయగలిగినా.. పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించడంలో పాలకులు వెనుకబడ్డారు. లైమ్ సిటీగా పిలువబడే పిడుగురాళ్ల శివారు ప్రాంతాల్లో ఏడెనిమిది కాలనీలు ఉన్నాయి. ఈ కాలనీలు ఏర్పడి 20 ఏళ్లు అవుతున్నా.. అక్కడ నివాసముంటున్న వారిలో 90 శాతం మంది రెక్కాడితే గాని డొక్కాడని శ్రామికులే. నిత్యం ఆ ప్రాంతంలో ఉంటే సున్నం మిల్లులు, బట్టీల్లో పనిచేస్తేనే పూటగడిచే స్థితి వారిది.



ఇందిరమ్మ కాలనీలో అంతర్గత రహదారుల దుస్థితి

లెనిన్‌నగర్, స్వర్ణ పిచ్చయ్య కాలనీ, ఇందిరమ్మ కాలనీ, సుందరయ్య కాలనీ, రిక్షా కాలనీ, వైఎస్ కాలనీ, సంద్రపాలెం, ఆదర్శ కాలనీలు. ఇవన్నీ కూడా ప్రభుత్వ భూముల్లో గత పాలకులు అక్కడ ఉంటున్న వారికి పట్టాలు పంపిణీ చేయడంతో ఏర్పడినవి. కొందరు ఆ స్తోమత లేక గృహాలు నిర్మించుకోకపోవడంతో... నేటికీ ఖాళీ స్థలాలే అక్కడ కనిపిస్తున్నాయి. లెనిన్ నగర్‌లో 2019లోపు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రహదారులు నిర్మించారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం సైడ్ డ్రెయిన్స్ కూడా ఏర్పాటు చేయలేదు. తాగునీటి కుళాయిలు కొన్ని చోట్లకే పరిమితం చేశారు. రెండేళ్ల క్రితం ఈ ప్రాంతంలో నీటి కలుషితం వల్ల డయేరియా సోకి ఐదారుగురుకి పైగా మృతి చెందారు. స్వర్ణ పిచ్చయ్య కాలనీలో ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసి, వీధిలైట్లు ఏర్పాటు చేయాల్సి వుంది. ఇందిరమ్మ కాలనీ ఏర్పాటై సుమారు 20 ఏళ్లు గడుస్తున్నా నేటికి ఆ కాలనీలో ప్రధాన, అంతర్గత రహదారులు ఏర్పాటు కాలేదు. వర్షం వస్తే మోకాళ్లలోతు నీటిలో నడవాల్సి వస్తుంది. తాగునీటికి పురపాలక సంఘం సరఫరా చేసే వాటర్ ట్యాంకర్ ఇక్కడ దిక్కు. వీధి లైట్లు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదు. ఉన్నవి సరిగా పనిచేయడం లేదు. సుందరయ్యకాలనీ రహదారి గుంతలమయంగా మారింది. ఈ కాలనీలో పట్టాలిచ్చినా కొందరు మాత్రమే గృహాలు నిర్మించుకున్నారు. ఇక్కడ అంతర్గత రోడ్లు లేకపోవడంతో కొండ రాళ్ల పైనే నడక సాగించాల్సి వస్తుంది. సుందరయ్య కాలనీలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తండ్రి లక్ష్మయ్య పేరిట ఏర్పాటు చేసిన పాఠశాలే కొందరికి చదువుల ఒడిగా మారింది. ఇక్కడ గతంలో ఎమ్మెల్యే యరపతినేని విద్యుత్, తాగునీటి వసతి ఏర్పాటు చేయడం జరిగింది. ఇంకా రహదారులు నిర్మించాల్సి ఉంది. రిక్షా కాలనీ, వైఎస్ కాలనీ, సంద్రపాలెం, ఆదర్శ కాలనీలలో కూడా రహదారులు ఏర్పాటు చేయాలి. ఇక్కడ పట్టాలు కొందరికే పంపిణీ చేయగా మరికొందరు అనధికారికంగా నివాస గృహాలు ఏర్పాటు చేసుకొని ఉన్నారు. ఈ కాలనీలో చీకటి పడితే రహదారులపై పాములు, విషపురుగులు సంచరిస్తూ ఉంటాయి. ఇప్పటికైనా పాలకులు, ప్రభుత్వాలు శివారు ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళిక చేస్తే అభివృద్ధి కనిపించే అవకాశం ఉంది.

అభివృద్ధికి ప్రణాళిక

శివారు ప్రాంతాల అభివృద్ధికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఇప్పటికే మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వార్డుకు సుమారు రూ. 15 లక్షల నిధులను శివారు ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్, తాగునీటి వసతికి కేటాయిస్తాం.



- ఎ.శ్రీధర్, కమిషనర్

ప్రమాణాలకే.. ప్రాధాన్యం



- ఇంటర్ విద్యలో నూతన మార్పులకు శ్రీకారం
- జాతీయస్థాయి ప్రమాణాలే లక్ష్యంగా సిలబస్, బోధన
- ఏపీ ఈ ఏపీ సెట్‌కు ఉపయోగం అధ్యాపకులకు త్వరలో శిక్షణ

గుంటూరు(విద్య) ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో పోటీ పరీక్షలు, ప్రమాణాలే లక్ష్యంగా ఇంటర్ విద్యలో సమూల మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. దీంతోపాటు రాష్ట్ర స్థాయిలో ఏపీ ఈఏపీసెట్(ఎంసెట్) ద్వారా ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశ పరీక్షకు ఈ మార్పులు ఉపయోగపడనున్నాయి. ఇందులో భాగంగా ఇప్పటికే కొన్ని సబ్జెక్టులను కుదించి ఒకే సబ్జెక్టుగా మార్చడం. సిలబస్, పరీక్షల విధానం, మార్కుల కేటాయింపు తదితర అంశాల్లో కొత్త విద్యా సంవత్సరం నుంచి నూతన మార్పులు అమల్లోకి రానున్నాయి. ప్రధానంగా జాతీయస్థాయిలో నిర్వహించే ఐఐటీ జేఈఈ, నీట్ పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా నూతన మార్పులు రానున్నాయని అధ్యాపకులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్ ఆధ్వర్యంలో 35 పైగా జూనియర్ కళాశాలలు, వృత్తి విద్య కళాశాలలు ఉన్నాయి. ఇంకా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీలు, హైస్కూల్ ప్లస్, గురుకుల జూనియర్ కళాశాలలో మరో 50 వరకు ఉన్నాయి. అదేవిధంగా, ప్రైవేట్ యాజమాన్యాల ఆధ్వర్యంలో 100కు పైగా జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలలో ఇంటర్ ప్రథమ ద్వితీయ సంవత్సరాల్లో దాదాపు 80 వేల మందికి పైగా విద్యార్థిని విద్యార్థులు ఇంటర్ విద్య అభ్యసిస్తున్నారు . ఇంటర్‌లో ప్రస్తుతం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, హెచ్‌ఈసీ ప్రధాన గ్రూపులు ఉన్నాయి .వీటితో పాటు ఎంబైపీసీ గ్రూపును కూడా ఈ ఏడాది నుంచి ప్రవేశపెట్టడానికి ఇంటర్ బోర్డు సన్నాహాలు చేస్తున్నది. మరో వైపు వృత్తి విద్యా కళాశాలల్లో కూడా నూతన కోర్సులు సిలబస్ లో మార్పులపై అధ్యయనం చేస్తున్నారు.

ముందస్తు తరగతులు.. పుస్తకాల పంపిణీ

ఇంటర్ బోర్డు ఆదేశాల ప్రకారం ఇప్పటికే అనేక కళాశాలలో తరగతులు ప్రారంభమయ్యాయి. గత నెల 24 నుంచి దాదాపు నెల రోజుల పాటు తరగతులు నిర్వహించారు .ప్రధాన సబ్జెక్టుల్లో రెండు మూడు యూనిట్లు కూడా పూర్తి చేశారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కూడా ప్రారంభించారు.

ఇంటర్ సిలబస్‌లో మార్పులు ఇలా ..

ఇంటర్ ఇప్పటివరకు మాథ్స్ ఏ, బి సబ్జెక్టులు ఉన్నాయి. వీటిని ఒకే సబ్జెక్టుగా చేయనున్నారు. బోటనీ జువాలజీ సబ్జెక్టులను కలిపి బయాలజీగా (మిగతా 6వ పేజీలో)

అధ్యాపకులకు శిక్షణ కోసం కసరత్తు

ఇంటర్ బోధించే అధ్యాపకులకు మారిన సిలబస్ నూతన విధానాల ప్రకారం శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ఇంటర్ బోర్డు కసరత్తు చేస్తోంది. జాతీయస్థాయి పరీక్షలకు అనుగుణంగా మారిన సిలబస్‌లో బోధన ఎలా చేయాలి.. , విద్యార్థుల్ని పరీక్షలకు ఎలా సన్నద్ధం చేయాలి - వంటి అంశాలపై పునశ్చరణ తరగతులు నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ వేసవి సెలవుల్లోనే పునశ్చరణ తరగతులు పూర్తిచేసి జూనియర్ కళా శాలల ప్రారంభం నాటికి అధ్యాపకులను బోధనకు సన్నద్ధం చేయాలని యోచిస్తున్నారు.

వరి కుప్పకు నిప్పు



వేల్పూరు(శావల్యాపురం) ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వరి పంట గూడుకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పూర్తిగా దగ్ధమైన ఘటన మండలంలోని వేల్పూరు గ్రామంలో సోమవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాదినేని వీరాంజనేయులు ఇర్లపాడుకు వెళ్లే డొంక దారిలో తనకున్న ఎకరం పొలంలో గత డిసెంబర్‌లో వరి పంట కోసి గూడు వేశాడు. గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం తెల్లవారుజామున దానికి నిప్పంటించడంతో మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకొన్న వీరాంజనేయులు గ్రామస్తులతో కలసి పొలానికి వెళ్లి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా.. అప్పటికే పంటగూడు పూర్తిగా కాలిపోయింది. పంట విలువ రూ.75 వేలు ఉంటుందని, ఆరుగాలం శ్రమించి పంట పండిస్తే దుండగులు ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. వేల్పూరులో ఇటీవల పొలంలో నిల్వ చేసిన పొగాకు బేళ్లు, గ్రామంలోని దొడ్డిలో వేసిన గడ్డివామిని కూడా ఇలానే కాల్చివేశారని, గ్రామానికి చెందిన వ్యక్తి ఒకరు ఇలాంటి దుర్చర్యలకు పాల్పడుతున్నాడని బాధితులు అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై ఎస్‌ఐ లేళ్ల లోకేశ్వరరావును కలసి ఫిర్యాదు చేశామని తెలిపారు. దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాణాలకే.. ప్రాధాన్యం

(5వ పేజీ తరువాయి)



ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాల

మారుస్తున్నారు. దీనికి అనుగుణంగా మార్కుల కేటాయింపు చేస్తారు. పార్ట్ -1 లో ఆంగ్లం , పార్ట్ 2లో జాతీయ భాషలతో పాటు మరికొన్ని సబ్జెక్టులు ఉంటాయి. విద్యార్థి తన అభిరుచి మేరకు ఏదైనా సబ్జెక్టును ఎంపిక చేసుకునే వెసులుబాటు ఇంటర్ బోర్డు కల్పించనుంది. పార్ట్ -3లో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయి. కొత్తగా ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంబైపీసీ గ్రూపు ను కూడా ప్రవేశపెట్టనున్నారు. దీని ద్వారా ఇటు ఇంజనీరింగ్ అటు మెడికల్ ప్రవేశ పరీక్షల్లో కూడా విద్యార్థులు పాల్గొనే అవకాశం కలుగుతుంది. ఇదిలా ఉంటే పార్ట్ 1, 2, 3లలో వచ్చిన మార్కులే పరిగణలోకి తీసుకుంటారు. ఇందులో కనీసం ప్రతి సబ్జెక్టులో 35 మార్కులు రావాల్సి ఉంటుంది. వృత్తి విద్యా కోర్సుల్లో పాస్ మార్కుల్లో వ్యత్యాసం ఉంది. ఇక ఇంటర్‌లో విద్యార్థి ఎంచుకున్న అదనపు సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులు అయితే మెడికల్, ఇంజనీరింగ్ బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్‌మాటిక్స్ వంటి కోర్సులు అధ్యయనానికి ఉపయోగపడతాయని అధ్యాపకులు చెప్తున్నారు.

ప్రశ్నాపత్రంలో మార్పులు

ప్రశ్నాపత్రం విషయంలో మార్పులు తీసుకురానున్నారు. సైన్స్ గ్రూపుల్లో ఎన్సీఈఆర్టీ సిలబస్ ప్రకారం, ఆర్ట్స్ గ్రూపుల్లో హ్యూమానిటీస్ విధానాలను అనుస రించారు. సైన్స్ సబ్జెక్టుల్లో 85 మార్కులకు, ఇతర సబ్జెక్టుల్లో వంద మార్కులకు ప్రశ్నాపత్రం ఉంటుంది. ప్రయోగ పరీక్షలకు 30 మార్కులు కేటాయిస్తారు. ఇలా అనేక నూతన మార్పులకు ఇంటర్ బోర్డు శ్రీకారం చుడుతోంది. విద్యార్థులు భవిష్యత్తులో జాతీయస్థాయి పోటీ పరీక్షలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో మెరుగైన ఫలి తాలు సాధించేలా నూతన మార్పులు దోహదపడతాయని అధ్యాపకులు చెబుతున్నారు.

తెల్లబోతున్న.. జొన్న

(5వ పేజీ తరువాయి)

చూపించి కొద్దిగా రంగులో వ్యత్యాసం కనిపించినా రూ. 1700 నుంచి రూ. 1800 వరకుమాత్రమే కొంటామని, లేకుంటే తీసుకుపోవాలంటూ తిప్పి పంపుతున్న పరిస్థితి ఉంది. అయితే కొనుగోలు కేంద్రాలు ఉంటే, మరో ప్రత్యామ్నాయం రైతుల ముందుండేది. ఇప్పుడు ఏదీ లేకపోవటంతో వ్యాపారులు, దళారులు బెదిరిస్తున్నా చేసేదిలేక వారు చెప్పిన రేటుకే తెగ నమ్ముతున్నారు. మరోపక్క నిల్వ ఉంచుకుందామన్నా, మొక్కజొన్నయితే పర్వాలేదు కానీ, తెల్లజొన్న ఏమాత్రం రంగు మారినా, బూజుపట్టినా రేటు విషయంలో అసలుకే నష్టం వస్తుందనే ఆలోచనతో రైతులు నిల్వ ఉంచటానికి ధైర్యం చేయటంలేదు.

జొన్నలు కొంటామని ఒకసారి... పొరపాటు పడ్డాం కొనలేమని మరోసారి...

జొన్నలు కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలుచేస్తాం... రేటు లేదని ఆందోళన పడాల్సిన పనిలేదు... ఇదీ గత వారం క్రితం పౌరసరఫరాల శాఖ అధికారులు చేసిన ప్రకటన. లేదు... లేదు... మీ జొన్నలు మేం కొనలేం. మేమే పొరపాటు పడ్డాం. మనుషులు తినేవి కాదు కనుక మేము కొనటానికి వీలులేదంటూ రెండు రోజుల తర్వాత మరో ప్రకటన. మొదటి ప్రకటన వచ్చినప్పుడు రైతులంతా సంతోషించారు. తమ జొన్నలు రేటు లేనితరుణంలో ప్రభుత్వం కొంటుంది కనుక నష్టం ఉండదని ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఆ ఆనందం ఎన్నో రోజులు నిలవలేదు. రెండు రోజుల్లోనే మరో ప్రకటన కూడా అధికారుల నుంచే విడుదలయిందని, కేంద్రం సూచించిన ప్రకారం మన ప్రాంతంలో పండించే జొన్నలు మనుషులు తినేందుకు పనికివచ్చేవి కాదని, వాటిని పరీక్షిస్తే హానికర క్రిమిసంహారకాలు పెద్ద మోతాదులో ఉన్నట్టు తేలిందని, అందువల్ల ఆ జొన్నలు కొనలేమంటూ మరో ప్రకటన చేశారని రైతులే చెబుతున్నారు. దీని ప్రకారం చూస్తే ఇకపై కొనుగోలు కేంద్రాలు రబీ పంటల కొనుగోలుకు ఉండవనేది తేలిపోయిందని, అర్ధంతరంగా ఇటువంటి నిర్ణయం తీసుకుంటే ఎట్లాగంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం రూ. 3,460 అవసరం లేదని, కనీసం రూ. 2400 నుంచి రూ. 2600 వరకు జొన్నల నాణ్యతనుబట్టి రేటు నిర్ణయించినా చాలని వేడుకుంటున్నారు. కేంద్రాలు తెరవలేని పక్షంలో కనీస ధర అందేలా చూడాలని, ప్రభుత్వం దీనిపై వెంటనే ఒక నిర్ణయం తీసుకోకుంటే జొన్న రైతులు అప్పులపాలు కావటమేనంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క మినుములు, పెసలకూ మద్దతు ధర నిర్ణయిస్తే అంతటి రేటు అందుతున్న పరిస్థితిలేదు. మినుములు క్వింటాకు రూ. 7,400, పెసలు క్వింటాకు రూ. 8,682 చొప్పున మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ప్రాంతాలను బట్టి రేట్లలో వ్యత్యాసం ఉన్నా, మద్దతు ధరను అందుకున్న పరిస్థితిలేదు. వీటిపై కూడా దృష్టిపెట్టాలనేది రైతుల విన్నపం. ఏదిఏమైనా జొన్న వంటి తక్కువ విస్తీర్ణంలో సాగయిన పంటలకయినా మద్దతు ధరకు దగ్గరగా కొనుగోలు చేయగలిగితే రైతులు గట్టెక్కినట్టే. పౌరసరఫరాల శాఖ దీనిపై నిబంధనల ప్రకారం కాకుండా రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవలసిన అవసరం ఉంది.


మొక్కజొన్నలు రేటు ఆశాజనకంగా ఉండటంతో చేలల్లోనే లారీలకెత్తేస్తున్న రైతులు

హోరాహోరీగా ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన

వినుకొండటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మదమంచిపాటి వీరాంజనేయస్వామి తిరునాళ్లను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మొదటి స్థానం కైవసం చేసుకునేందుకు ఎడ్ల యజమానులు చివరి క్షణం వరకు శ్రమిస్తున్నారు. ఆరు పళ్ల విభాగంలో జరిగిన పోటీల్లో బాపట్ల జిల్లా వేటపాలెం, పంగులూరుకు చెందిన అత్తోటి శిరీషాచౌదరి, శివరామకృష్ణచౌదరి, చిలుకూరి నాగేశ్వరరావుకు చెందిన ఎడ్లు 5,448 అడుగులు లాగి మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం ఆకువీడుకు చెందిన సూరా పూజితరెడ్డికి చెందిన ఎడ్లు 4,720 అడుగులు లాగి రెండో బహుమతి, పల్నాడు జిల్లా దాచేపల్లి కేసానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్యకు చెందిన ఎడ్లు 4581 అడుగులు లాగి 3వ బహుమతి, పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చల్లగుండ్లకు చెందిన మేకా అంజిరెడ్డి ఎడ్లు 4,500 అడుగులు లాగి 4వ బహుమతి, బాపట్ల జిల్లా బల్లికురవ మండలం గంగన్నపాలేనికి చెందిన నలమాద ఉత్తమ్ పద్మారెడ్డి (ఎంఎల్‌ఏ, కోదాడ), టీఎస్ అండ్ రాయుడు సుబ్బారావుకు చెందిన ఎడ్లు 4,250 అడుగులు 5వ బహుమతి, నాగరికర్నూల్ తెలకపల్లి మండలం పర్వతపురానికి చెందిన శ్యామలా చరణ్‌తేజ, టీఎస్ ఉప్పునూతల మండలం వెల్లటూరుకు చెందిన శివరామకృష్ణ ఎడ్లు 3,781 అడుగులు లాగి 6వ బహుమతి కైవసం చేసుకున్నాయి. పోటీల్లో గెలుపొందిన యజమానులకు డాక్టర్ అన్నవరపు వీరాంజనేయులు, దూలం కోటిరెడ్డి, ఎస్. నారాయణరెడ్డి, నాగిరెడ్డి అంజిరెడ్డి, రొడ్డా నాగిరెడ్డి, నారాయణరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రామినేని మణికిరణ్, లిఖిత, సోమేపల్లి బ్రహ్మయ్య, బట్టు గోపి, జక్కిరెడ్డి ప్రభాకరరెడ్డి, అనుమోలు నాగాంజిరెడ్డి నగదు బహుమతి అందజేశారు. పోటీలను తిలకించేందుకు వచ్చిన రైతులతో పాటు నిర్వాహకులకు, ఎడ్ల యజమానులకు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు దేవస్థాన ఆవరణలో నిత్యం అన్నదాన కార్యక్రమం కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మక్కెన వెంకట్రావు, అనుమోలు సుబ్బారెడ్డి, మాదాల చిరంజీవి, కుంటా కోటిరెడ్డి, జగ్గారెడ్డి, అక్కిరెడ్డి, గురువారెడ్డి, కుంటా కోటిరెడ్డి, తిప్పిరెడ్డి, అంజిరెడ్డి, చప్పిడి రామారావు, పోకా సుబ్బారావు, నాగులపాటి గుర్నాథం, వెంకటరెడ్డి పాల్గొన్నారు.


ఆరు పళ్ల విభాగంలో మొదటి బహుమతి సాధించిన ఎడ్ల యజమానులకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

బర్లీ పొగాకు కొనుగోళ్లు ప్రారంభించాలి

● ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి నాయకుల డిమాండ్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పండిన బర్లీ పొగాకును కంపెనీలు, ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా క్వింటా రూ.18 వేలు ధర చెల్లించి కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశం డిమాండ్ చేసింది. సోమవారం గుంటూరులోని మల్లయ్యలింగం భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకుడు వైకేశవరావు అధ్యక్షతన రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఏడాది క్వింటా రూ.4వేల నుంచి రూ.5 వేల వరకు కొనుగోలు చేస్తున్నారని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 9 జిల్లాల్లోని మూడు లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేసిన పొగాకులో గణనీయమైన సంఖ్యలో బర్లీ పొగాకు ఉందని తెలిపారు. ఎకరానికి రూ.1.65 లక్షల పెట్టుబడి రైతులు పెట్టారని పంట మార్కెట్‌కు వచ్చే సమయానికి ప్రోత్సహించిన కంపెనీలు మొహం చాటేసాయని ఆరోపించారు. నల్లమడ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ వైట్ బర్లీ, నల్ల బర్లీ పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేసే విధంగా కంపెనీలపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సమితి నాయకులు పి.జమలయ్య, మల్లారెడ్డి వెంకటరెడ్డి, తోట ఆంజనే యులు, మన్నవ హరిప్రసాద్, జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ తక్షణమే పొగాకు పండించే ప్రాంతాల్లో సంఘాలతో సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. 25వ తేదీలోపు సదస్సులు జరిపి ఉద్యమానికి సన్నద్ధం చేయాలని, 30లోపు ప్రజా ప్రతినిధులు వినతి పత్రాలు అందజేయాలని, మే 5న చలో ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరుకుని సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని సూచించా రు. ఈ సమావేశంలో రైతు సంఘ నాయకులు వి.కృష్ణయ్య, వై. రాధాకృష్ణ, కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ పలు జిల్లాల నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కేవీవీ ప్రసాద్, పాల్గొన్న కొల్లా రాజమోహన్ తదితరులు

విశ్రాంత ఉద్యోగుల గగ్గోలు

● మూడో వారంలోనూ పింఛన్ చెల్లించని ఏఎన్‌యూ

పెదకాకాని, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ) రిటైర్డ్ ఉద్యోగులు పెన్షన్ కోసం మూడు వారాలుగా ఎదురుచూస్తున్నారు. 2, 3 తేదీల్లో చెల్లించాల్సి పెన్షన్ ఇంతవరకు అందుక పోవడంతో వర్సిటీ విశ్రాంత ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. విశ్వవిద్యాలయంలో సుమారు 700 మంది పెన్షనర్లకు నెలకు రూ.2.3 కోట్లు చెల్లించాలి ఉంది. ఇప్పటి వరకు ఆ మొత్తాన్ని విడుదల చేయకపోవడంతో వారంతా ఆర్థిక సతమతం అవుతున్నారు. పెన్షన్ చెల్లింపులో ఆలస్యం కారణంగా కుటుంబ పోషణ కష్టంగా మారిందని పెన్షనర్లు వాపోతున్నారు. విశ్వవిద్యాలయం విశ్రాంత ఉద్యోగులపై వర్సిటీ ఉన్నతాధికారులు నిర్లక్ష్య ధోరణిలో ఉన్నారు. దీంతో వర్సిటీ ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతూ తమ పెన్షన్ ఇప్పించాలని విశ్రాంత ఉద్యోగులు వేడుకుంటున్నారు. దీనిపై పెన్షన్ దారులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేయాలని యోచిస్తున్నారు. దీనిపై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం వివరణిచ్చారు. పెన్షన్ కి సంబంధించి బ్లాక్ గ్రాండ్ రాలేదని ఆయన తెలిపారు. గ్రాంట్ అనుమతి రాగానే చెల్లింపులు చేపడతామని సమాధానం ఇచ్చారు.

టీడీపీ సానుభూతిపరుడిపై హత్యాయత్నం

మనుమరాలిపై ఇద్దరు యువకుల వేధింపులు
మందలించినందుకు వైసీపీ మూకలతో దాడి

నకరికల్లు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పల్నాడులో వైసీపీ అరాచకం పెచ్చుమీరింది. బాలికను వేధించొద్దని మందలించినందుకు.. ఆమె ఇంటిపై యువకుల తరఫున వైసీపీ గూండాలు దాడి చేశారు. బాలిక తాతయ్యపై హత్యాయత్నం చేసి, ఇంటిలోని సామగ్రిని ధ్వంసం చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ఓ బాలికను కొన్ని రోజులుగా ఇద్దరు యువకులు వేధిస్తున్నారు. ఆదివారం మండలంలోని కుంకలగుంట గ్రామంలో నిదానంపాటి శ్రీ లక్ష్మి అమ్మవారి తిరునాళ్లకు వెళ్లిన ఆ బాలికను యువకులు బైక్‌తో చెక్కెర్లు కొండుతూ తీవ్ర వేధింపులకు గురిచేశారు. ఈ విషయం బాలిక కుటుంబ సభ్యులకు, బంధువులకు తెలిపింది. సంబంధిత యువకులను వారు హెచ్చరించారు. సోమవారం కూడా ఇలాగే వ్యవహరించటంతో ఆ యువకులను మందలించారు. దీనికి ఆగ్రహించిన ఆ యువకుల తరుపున వైసీపీ గూండాలు ఆ బాలిక తాతయ్య ఇంట్లో నిద్రిస్తుండగా బండ తీసుకొని తలపై మోది హత్యాయత్నానికి పాల్పడ్డారు. కాళ్లతో, చేతులతో, కర్రలతో దాడి చేశారు. ఇంట్లోని వస్తువులన్నీ పగల గొట్టారు. బీరువాలో ఉన్న బంగారం, నగదును అపహరించుకుపోయారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఉప్పలపాటి సుబ్బయ్యను చికిత్స నిమిత్తం నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నా యి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఘటన జరిగిన ప్రాం తంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆ ప్రాంత ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

భర్త వేధింపుల తాళలేక.. భార్య ఆత్మహత్య


శిరీష మృతదేహం

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకుంటున్న ఘటన మండలంలోని కంటెపూడిలో సోమవారం జరిగింది. రూరల్ పోలీసులు కథనం మేరకు.. గ్రామానికి చెందిన గుంటగాని వేణు అలియాస్ వేమయ్యతో కట్టువారిపాలేనికి చెందిన శిరీషకు 16 సంవత్సరాల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి వేణు మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవ పడుతూ ఉండేవాడు. మద్యానికి డబ్బులు ఇవ్వాలని వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి కూడా భార్య శిరీషతో వేణు గొడవ పడ్డాడు. అతని వేధింపులు తాళ లేక శిరీష తెల్లవారు జామున ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇది గమనించిన వేణు కుటుంబ సభ్యులు సమాచారాన్ని శిరీష తల్లిదండ్రులకు చేరవేశారు. శిరీష మృతి వార్త తెలుసుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి, మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. శిరీషకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి తండ్రి చెరుకూరి నెహేమియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్‌ఐ అమీనుద్దీన్ తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 514.70 అడుగులు ఉంది. ఇది 139.78 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 28.68 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా నాలుగు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

కొలిక్కి వస్తున్న.. రీ సర్వే

(5వ పేజీ తరువాయి)

రాగా, ఒక్క బాపట్ల జిల్లలోనే 4,115 వినతులు వచ్చాయి. వీటిలో దాదాపు 80 శాతం పరిష్కరించారు. మిగిలిన వాటి విషయంలో నిర్ణయాన్ని ఉన్నతాధికారులకు రిఫర్ చేసినట్లు యంత్రాంగం చెబుతోంది. అదే విధంగా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన 9,500 అర్జీల్లో 75 శాతం ఇప్పటికే పరిష్కరించామని, మిగిలిన వాటిలో కసరత్తు జరుగుతతుందనేది రెవెన్యూ విభాగం మాటగా ఉంది

క్లిష్టతరం.....వైసీపీ నిర్వాకమే...

గ్రామ సభలతో పాటు రెవెన్యూ సదస్సులు, ఇప్పుడు ఎంపిక చేసిన గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వే ఘట్టం ఇలా ప్రతి అంకంలోనూ గ్రామాల్లో సంక్లిష్టంగా ఉండే భూ వివాదాలు పదుల సంఖ్యలోనే వెలుగు చూస్తున్నాయి. వాటిపై ఓ నిర్ణయానికి రావడం యంత్రాంగానికి సవాల్‌గా మారింది. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి రీ సర్వే చేపట్టిన మూడు జిల్లాల గ్రామాల పరిధిలో దాదాపు 1050 సర్వే నెంబర్ల విషయంలో తుది నిర్ణయానికి రావడం అధికారులకు క్లిష్టంగా మారింది. వీటి పరిధిలో ఉన్న చిక్కులను పరిష్కరించడం యంత్రాంగానికి సవాల్‌గా మారిందది. దీనికి ప్రధాన కారణం వైసీపీ నేతలు అధికారం అండతో రికార్డులు తారుమారు చేసి మరీ భూములను చెరబట్టారు. అధికారికంగా లెక్కల్లో భూమి వారిపేరు మీద ఉంది కానీ బాధితులు మాత్రం పెద్దసంఖ్యలో కనబడుతున్నారు. కొంతమంది రెవెన్యూ సిబ్బంది అండతో అక్రమాలను సైతం పక్కాగా రెగ్యులరైజ్ చేయించుకునే తంతు గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా నడిచింది. వీటి విషయంలో తుది నిర్ణయానికి వస్తే తప్ప గ్రామాల్లో భూ రికార్డులకు గాను ఫైనల్ ఆర్‌వోఆర్ ఓ కొలిక్కి వచ్చే అవకాశం లేదు. ఇలాంటి వాటిపై కూడా ఓవిధానపరమైన నిర్ణయం తీసుకునే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. రీ సర్వేని మమ అనిపించకుండా స దరు గ్రామాల్లో మళ్లీ భూ వివాదం అనే మాట వినపడడానికి వీల్లే దని, ఇదే సమయంలో బాధితుందరికీ న్యాయం జరగాల్సిందేనన్న పట్టుదలతో ప్రభుత్వం అడుగులేస్తుండడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

హత్యాయత్నం కేసులో ఏడుగురికి జైలు, జరిమానా

నరసరావుపేట లీగల్, యడ్లపాడు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నేరం నిరూపణ కావడంతో ఏడుగురు నిందితులు ఒక్కొక్కరికి నాలుగు సంవత్సరాల జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ స్థానిక సహాయ సెషన్స్ న్యాయమూర్తి కె.మధుస్వామి సోమవారం తీర్పు వెలువరించారు. 2021 జులై 30న రాత్రి యడ్లపాడు మం డలం తిమ్మాపురం గ్రామంలో పంపు నీళ్ల తెచ్చుకునే విషయమై చోటు చేసుకున్న వివాదం చోటు చేసుకుంది. నేపథ్యంలో ఫిర్యాదిదారులు బిరుదు రవి, బిరుదు అనంతను నిందితులు అదే గ్రామానికి చెందిన కారు చోళ సుభాని, పెద్ద అంజయ్య, చిన్న కోటి లింగయ్య, మణికు మార్, బుజ్జి, పెద్ద కోటి లింగయ్య, హనుమంతరావు కత్తి, గొడ్డళ్లతో హత్యాయత్నానికి ఒడిగట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితులను అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతోపై విధంగా కోర్టు తీర్పు వెలువడింది.

మహిళ హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

గుంటూరు(లీగల్), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): చేతబడి చేస్తుందనే భయంతో పక్కింటి మహిళను కత్తితో నరికి చంపడమే కాకుండా.. అడ్డు వచ్చిన ఆమె సోదరిని కూడా కత్తితో పొడిచి చంపాలని ప్రయత్నించినట్టు నేరం రుజువు కావడంతో తుళ్లూరులోని కొత్తూరుకు చెందిన షేక్ నాగుల్ మీరావలికి జీవిత ఖైదు, రూ.2వేల జరిమానా విధిస్తూ గుంటూరు రెండవ అదనపు జిల్లా జడ్జి వైనాగరాజు సోమవారం తీర్పు చెప్పారు. వివరాల మేరకు.. మృతురాలు లాల్ బీకి ఇంటి పక్కనే నివసించే షేక్ నాగుల్ మీరావలికి మధ్య స్థల వివాదం ఉంది. మంగళగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో వీరి మధ్య సివిల్ దావా కూడా నడుస్తోంది. ఈ నేపథ్యంలో లాల్ బీ రాత్రిపూట తన ఇంటి ముందు మంట వేసి, జుట్టు విరబోసుకుని దాని చుట్టూ తిరు గుతూ పెద్దగా అరుస్తూ ఉండటం నాగుల్ మీరావాలి గమనించాడు. ఓసారి ఆమెను చెంపపై కొట్టి మందలించాడు. అయినా ఆమె తన ప్రవర్తన మార్చుకోలేదు. దీంతో ఆమె మంత్రగత్తె అని, స్థల వివాదం నేపథ్యంలో తనపై చేతబడి చేస్తుందని భావించాడు. చేతబడి చేయవద్దని ఆమెను వేడుకొన్నాడు. పక్కనే ఉండే తన ఇంటిని ఖాళీ చేసి.. వేరే ఇంటికి మారాడు అయినా అతనిలో భయం పోలేదు. 2017 మార్చి 2న రాత్రి లాల్ బీ తన తండ్రి మౌలాలి సాహెబ్, సోదరి రాజంబీతో కలిసి ఇంట్లో ఉండగా నిందితుడు నాగుల్ మీరావలి కత్తితో వచ్చి ఆమెను మెడ నరికి చంపాడు. అడ్డువచ్చిన సోదరి రాజంబీని కూడా కత్తితో మెడపై పొడిచాడు. చుట్టుపక్కల వారు కేకలు వేయడంతో పరారయ్యాడు. లాల్ బీ అక్కడే మృతిచెందగా రాజంబి ఆసుపత్రిలో చికిత్స అనంతరం కోలుకుంటోంది. ఈ సంఘటనపై లాల్ బీ తండ్రి మౌలాలి సాహెబ్ ఫిర్యాదు మేరకు తుళ్లూరు పోలీసులు నిందితుడు నాగుల్ మీరావలిపై హత్య హత్యయత్నం కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ సుధాకర్ రావు కేసు దర్యాప్తు జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బర్కత్ అలీ ప్రాసిక్యూషన్ నిర్వహించారు. మీరావలిపై హత్యాహత్యాయత్నం నేరాలు రుజువు కావడంతో.. జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

భార్య ఇంటికి రాలేదని ఆత్మహత్య

మాచర్ల రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బైరవునిపాడులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సిరికొండ హనుమంతురావు (38)కు గుత్తికొండకు చెందిన సునీతతో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలు సంతానం. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో భార్య సునీత నెల రోజుల క్రితం భర్త, పిల్లలను వదిలి గుత్తికొండలోని తన తల్లి ఇంటికి వెళ్లిపోయింది. వారం క్రితం హనుమంతురావు కుమార్తెలను తీసుకొని తన భార్య దగ్గరకు వెళ్లి, ఇంటికి రావాలని కోరాడు. భార్య సునీత అంగీకరించకపో వడంతో.. కలత చెందిన హనుమంతురావు సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లి నరసమ్మ ఫిర్యాదు మేరకు విజయపురి సౌత్ ఎస్‌ఐ షేక్ మహ్మద్ షఫి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

1,42,976 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,49,133 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,42,976 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 63,568 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తేజ	10000	13400
334	9500	13000	షార్క్-1	10000	12000
నంబరు.5	10000	12500	బ్యాడిగి 355	10000	13000
273	10000	12500	సింజెంటా		
341	10000	13200	బ్యాడిగి 5531	--	--
4884	10000	11300	దేవనూరుడీలక్స్	10000	12500
సూపర్10	--	--	ఆర్మూరు	9800	11000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			తాలుకాయలు	4500	6500

పలు గ్రామాల దేవాలయాల్లో పూజా కార్యక్రమాలు

మాచవరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సీతారాముల కల్యాణం 16 రోజుల పండుగను పురస్కరించుకొని చెన్నాయపాలెం, వేమవరం రామాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ



జానపాడులో టీడీపీ సభ్యత్వ కార్డులను అందజేస్తున్న పార్టీ నేతలు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం పొందినవారికి సోమవారం కార్డులను అందజేశారు. బూత్ ఇన్‌చార్జ్‌లు సభ్యత్వ కార్డులను సభ్యత్వం పొందిన వారికి అందజేస్తున్నారు. వారంలోగా ఈ కార్డుల పంపిణీ పూర్తిచేసి గ్రామస్థాయి పార్టీ కమిటీలను నియమించుకునేలా సభ్యులందరూ సమన్వయంతో పనిచేయాలని మండల పార్టీ కన్వీనర్ గండికోట వెంకటేశ్వర్లు, వున్నం సురేష్, ముప్పాళ్ల సాంబయ్యలు తెలిపారు. జానపాడు, పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో సభ్యత్వ కార్డుల పంపిణీ వేగవంతంగా జరుగుతోంది.

వీరాపురంలో వరిగడ్డి దగ్ధం

పిడుగురాళ్ల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): వీరాపురం గ్రామానికి చెందిన పరుచూరి రమేష్ ఐదెకరాల వరిగడ్డి వామి సోమవారం అగ్నిప్రమాదానికి గురైంది. గ్రామస్థుల సమాచారం మేరకు పిడుగురాళ్ల అగ్నిమాపకశాఖ అధికారి కె.శ్రీనివాసరావు స్పందించి ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.60వేల విలువైన వరిగడ్డి వామి పూర్తిగా దగ్ధమైంది.

వైద్యుడి కుటుంబానికి చెక్కు అందజేత

పిడుగురాళ్ల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): గురజాలకు చెందిన శ్రీకాంత్ నర్సింగ్ హోమ్ వైద్యుడు చల్లగుండ్ల శ్రీరామమూర్తి గత ఏడాది మృతిచెందారు. ఐఎంఏ పిడుగురాళ్ల శాఖలో ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ ద్వారా రూ.6లక్షల చెక్కును శ్రీరామ్మూర్తి కుమారుడు డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాస్‌కు పిడుగురాళ్ల శాఖ అధ్యక్షుడు ధూళిపాళ్ల భరత్‌కుమార్, డాక్టర్ ఆలా సాంబశివరావు అందజేశారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

సత్తెనపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో మజ్జిగ పంపిణీ చలివేంద్రాన్ని సోమవారం ఆర్యవైశ్య నేతలు ప్రారంభించారు. కార్యక్రమంలో చౌట శ్రీనివాసరావు, కే రామకృష్ణ, డీ కాశీవిశ్వనాథం, డీ శ్రీనివాసరావు, డీ సుబ్బారావు, పీ శివన్నారాయణ, పలువురు ఆర్యవైశ్యనేతలు పాల్గొన్నారు.

వడ్డెర సత్యన్నకు నివాళులు

సత్తెనపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పట్టణ, నియోజకవర్గ వడియ రాజుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పీ సత్యన్న విగ్రహ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా పలువురు వడ్డెరలు సోమవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ళ మురళీ, బత్తుల సాంబశివరావు, కొమెర శివ శంకరరావు, కే నాగేశ్వరరావు, బీ నాగయ్య, బీ వరప్రసాదు, బీ సురేష్, శివరామకృష్ణ, శ్రీనివాసరావు, అంజనేయులు, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

దేచవరం మోడల్ స్కూల్‌లో ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

నకరికల్లు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): దేచవరం మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి సోమవారం ప్రవేశపరీక్ష నిర్వహించినట్టు కే వేళాంగిని మేరి తెలిపారు. 113మంది దరఖాస్తు చేసుకోగా 102మంది పరీక్షకు హాజరయ్యారు. ప్రతిభ, రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు కల్పించనున్నట్టు తెలిపారు.

క్రోసూరు 191మంది హాజరు...

క్రోసూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): క్రోసూరు మోడల్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన 6వ తరగతి ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసినట్టు ప్రిన్సిపాల్ మేరీ సుజన్ తెలిపారు. 217మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా 191 మంది పరీక్షలకు హాజరైనట్టు చెప్పారు. ఉదయం 10గంటల నుంచి 12వరకు పరీక్ష జరిగిందన్నారు. ఒకసారి సీటు సాధిస్తే ఇంటర్ వరకు ఏడేళ్లపాటు ఫీజులు లేకుండా పూర్తిస్థాయి ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన ఉంటుందన్నారు.

జెట్టిపాలెంలో 44మంది...

రెంటచింతల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని జెట్టిపాలెం మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో చేరడానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 44మంది బాలబాలికలు హాజరైనట్లు ప్రిన్సిపాల్ కె.పాపయ్య చెప్పారు.

భవన నిర్మాణ కార్మికులకు తీరని అన్యాయం

● సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి శిలార్ మసూద్

క్రోసూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల జగన్ పాలనలో భవన నిర్మాణ కార్మికులకు తీరని అన్యాయం జరిగిందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శిలారు మసూద్ విమర్శించారు. సోమవారం క్రోసూరులో భవన నిర్మాణ కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఐదేళ్లలో కార్మికులకు సంక్షేమ పథకాలు అందక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని కోరారు. ఈ మేరకు ఈనెల 24న నరసరావుపేటలో గాంధీపార్కు వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కరపత్రాలను భవన నిర్మాణ కార్మికసంఘ నాయకులతో కలసి ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కంభంపాటి మల్లికార్జునరావు, బత్తుల కొండలు, చిలక చినఏసయ్య, సీహెచ్ శ్రీనివాసరావు, ఏపూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు

● ఊడిపోతున్న శ్లాబ్ పెచ్చులు
● నూతన భవనాల కోసం ఎదురుచూపు



మండల పరిషత్ కార్యాలయంలో పెచ్చులూడిపోయిన శ్లాబ్



మండల పరిషత్ కార్యాలయం భవనం గోడల నుంచి చెట్టు కొమ్మలు

గురజాలటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల ప్రజా పరిషత్, తహసీల్దారు కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. 1986 మార్చి 9న ఎంపీడీఓ కార్యాలయాన్ని ప్రారంభించగా, తహసీల్దారు కార్యాలయ భవనాన్ని బ్రిటీష్ కాలంలో నిర్మించారు. ప్రస్తుతం ఈ భవనాల స్లాబ్‌లు పెచ్చులూడుతూ ప్రమాదభరితంగా మారాయి.

ప్రజా పరిషత్ భవనం ఇలా..

మండల ప్రజా పరిషత్ కార్యాలయం స్లాబు పెచ్చులూడి, ఇనుప రాడ్లు బయటకు తేలాయి. దీంతో ఆరేళ్ల క్రితం కార్యకలాపాలను జలవనరుల కేంద్రంలోకి మార్చారు. అధికారులు ఇక్కడి నుంచే విధులు నిర్వహిస్తున్నారు. అయితే భవన మరమ్మతులను మాత్రం పట్టించుకోలేదు. మండల పరిషత్ సమావేశాలతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన సమావేశాలు నిర్వహించుకోవడం కష్టసాధ్యంగా మారింది. కార్యాలయ గోడల నుంచి మొక్కలు బయటకు పొడుచుకువచ్చాయి. వర్షం పడిన సమయంలో భవనం పైకప్పు నుంచి నీరు కారుతోంది. కార్యాలయ ఫర్నీచర్ మొత్తం భవనంలోనే ఉంది.

తహసీల్దారు కార్యాలయంలో..

మండల రెవెన్యూ కార్యాలయం బ్రిటీష్ కాలంలో నిర్మించింది. కార్యాలయం పైకప్పు పెంకులు ఊడిపోయి రంధ్రాలు పడ్డాయి. వర్షం పడిన సమయంలో కార్యాలయంలోకి నీరు వస్తోంది. ఆ సమయంలో కార్యాలయంలోని రికార్డులను, ఫైళ్లను కాపాడుకోవానికి సిబ్బంది పరుగులు పెట్టక తప్పవడం లేదు. శిథిలావస్థకు చేరిన ఈ కార్యాలయం ఎప్పుడు ఏ ప్రమాదం తెచ్చిపెడుతుందోనని సిబ్బంది హడలిపోతున్నారు. మండల పరిషత్, మండల రెవెన్యూ కార్యాలయాలకు నూతన భవనాలు ఏర్పాటు చేయాలని ప్రజలు, సిబ్బంది కోరుతున్నారు.



పెచ్చులు ఊడిపోయిన మండల రెవెన్యూ కార్యాలయం పైకప్పు

నిఘాపెట్టి.. నీరుగార్చి!

● పీహెచ్‌సీల్లో అలంకార ప్రాయంగా సీసీ కెమెరాలు
● జిల్లా కేంద్రంతో అనుసంధానం చేయని వైనం



ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న సీసీ కెమేరాలు

సత్తెనపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు అలంకార ప్రాయంగా మారాయి. 2003లో వైసీపీ ప్రభుత్వ హయాంలో లక్షలాది రూపాయలు వ్యయంతో జిల్లాలోని 38 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేసింది. అన్ని చోట్లా సీసీ కెమేరాలు ఉన్నా.. వాటిని ప్రధాన సర్వర్‌తో అనుసంధానం చేయకుండా వదిలేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఎంతమంది రోగులు వస్తున్నారు? అక్కడి అధికారులు, సిబ్బంది పనితీరు, రోగులకు అందుతున్న సేవలు పరిశీలించేందుకు ప్రతి ఆరోగ్య కేంద్రంలో నాలుగైదు సీసీ కెమేరాలను ఏర్పాటు చేశారు. వాటితో పాటు వైద్య సేవలు ఎలా ఉన్నాయో రోగుల నుంచి అభిప్రాయ సేకరణ చేసేందుకు ట్యాబ్‌లు కూడా ఇచ్చారు. సీసీ కెమేరాలు ఎలా పని చేస్తున్నాయో పట్టించుకున్నవారు లేక పోవటంతో అవి నిరుపయోగంగా మారాయి. వీటిలోని దృశ్యాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు జిల్లా కేంద్రంలోని ఆరోగ్య శాఖ జిల్లా కార్యాలయంలో మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయలేదని తెలుస్తోంది. సత్తెనపల్లి మండలం ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆంధ్రజ్యోతి పరిశీలించగా సీసీ కెమెరాలు నిరుపయోగంగా ఉన్నాయి. వాటికి ఇంటర్నెట్ సౌకర్యం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంతో అనుసంధానం చేయలేదు. దీంతో ఇక్కడ బిగించిన సీసీ కెమెరాలు నామ మాత్రంగా ఉన్నాయి. ఈ విషయంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవిని వివరణ కోరగా.. ఆరోగ్య కేంద్రాల్లో సీసీ కెమెరాలను పర్యవేక్షించేలా ప్రధాన కార్యాలయంలో మానిటరింగ్ వ్యవస్థను విధించినట్లు తెలిపారు. కానీ, అనుసంధానం పనులు చేయక పోవటంతో ప్రస్తుతం ఈ వ్యవస్థ వినియోగంలో లేదని వెల్లడించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని వైద్యాధికారి సమాధానం ఇచ్చారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలపై నిరుద్యోగుల్లో ఆనందం

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వాగ్దానాలను అమలుచేయటంతో నిరుద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి కూటమి ప్రభుత్వం హామీని నెరవేర్చిందన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా 16,345 టీచర్ పోస్టుల భర్తీ కానుందని, హామీని నిలబెట్టుకొనే నాయకుడిగా మంత్రి లోకేశ్ ప్రజల గుండెల్లో నిలిచిపోతారన్నారు. గరిష్ఠ వయోపరిమితిని రెండు సంవత్సరాలు పెంచటంపై నిరుద్యోగులు కృతజ్ఞతలు తెలుపుతున్నారన్నారు. డీఎస్సీ ప్రక్రియలో గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టును కూడా భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసం చేసిందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్

నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

● నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్

మాచర్లటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల రాజకీయ, ఆర్థిక అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ అన్నారు. సోమవారం పట్టణంలో నాయీ బ్రాహ్మణ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు ఎన్నికల హామీల్లో భాగంగా నాయీ బ్రాహ్మణులకు అన్ని దేవాలయాల పాలకమండలిలో సభ్యులుగా అవకాశం కల్పించడం, దేవాలయాల్లో కల్యాణకట్టలో పనిచేసే క్షురకులకు నెలకు రూ.25వేల వేతనం ప్రకటించడం తదితర పథకాలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

భగవద్గీత ధారణ పోటీలో రమాదేవికి గోల్డ్‌మెడల్



అమరనేని రమాదేవి

రెంటచింతల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): భగవద్గీత ధారణ పోటీల్లో రెంటచింతలకు చెందిన అమరనేని రమాదేవి బంగారు పతకాన్ని సాధించింది. కర్నాటక రాష్ట్రంలోని మైసూరు గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమ నిర్వాహకులు దక్షిణాది రాష్ట్రాల స్థాయిలో భగవద్గీత పోటీలను ఆన్‌లైన్‌లో నిర్వహించారు. భగవద్గీతలోని 18 అధ్యాయాల్లో 700 ప్రశ్నలకు సమాధానమివ్వడంతో బంగారు పతకానికి ఎంపిక చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో మైసూరులో అవార్డును అందుకోనున్నారు.

ఇచ్చిన మాటను నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదే

● రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మస్తాన్‌షరీఫ్

బెల్లంకొండ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఘనత కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబునాయుడుదేనని రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ పేర్కొన్నారు. సోమవారం బెల్లంకొండ టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేలాదిమంది నిరుద్యోగ యువకుల ఉపాధి కల్పన కోసం కృషి చేస్తున్న వ్యక్తి చంద్రబాబునాయుడు అన్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించింది లేదని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కూడా కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నల్లమేకల లక్ష్మీనారాయణ, మండల నాయకులు అక్కల వెంకటరామిరెడ్డి, వెన్నా సీతారామిరెడ్డి, గుడిసె కొండయ్య, ఆసుల జగన్, ఓర్సు ఆనంద్, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, సయ్యద్ జానీ, ఎన్ పిచ్చయ్య, సలాం, హనుమంతరావు నాయక్, నాగమణి బాయి పాల్గొన్నారు.

స్లాటు బుక్ చేసుకున్న వారికే రిజిస్ట్రేషన్‌లు

● సబ్ రిజిస్ట్రార్ మహమ్మద్ నజమున్ హుస్సేన్



సబ్ రిజిస్ట్రార్ నిజమున్ హుస్సేన్

పెదకూరపాడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికే రిజిస్ట్రేషన్‌లు చేస్తామని పెదకూరపాడు సబ్‌రిజిస్ట్రార్ మహమ్మద్ నజమున్ హుస్సేన్ తెలిపారు. పెదకూరపాడులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ నుంచి పెదకూరపాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని అన్ని గ్రామాల్లో పొలాలు, స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించు కోవటానికి స్లాటు విధానం ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందన్నారు. ఆన్‌లైన్‌లో ఐజీఆర్ఎస్ స్లాటు బుకింగ్ చేసుకోవాలన్నారు. ప్రతిరోజు ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5వరకు స్లాటు బుకింగ్ చేసుకున్న వారికి రిజిస్ట్రేషన్‌లు చేస్తామన్నారు. బుకింగ్ చేసుకోని వారికి సాయంత్రం 5 గంటల తరువాత రిజిస్ట్రేషన్ చేస్తామని వివరించారు. ప్రజలు ఈ స్లాటు బుకింగ్ విధానాన్ని ఉపయోగించు కోవాలని కోరారు.

స్లాట్ బుకింగ్ తప్పనిసరి

● ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్

మాచర్లటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భూములు, స్థలాల క్రయ విక్రయాలకు సంబంధించి స్లాట్ బుకింగ్ తప్పనిసరని ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వినియోగదారులు సెల్‌ఫోన్‌లో ఓటీపీ తెలిపిన తరువాతే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. స్లాట్ బుకింగ్‌పై పట్టణంలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో పూర్తి వివరాలను అందిస్తామన్నారు.

అంకమ్మ తల్లి తిరునాళ్ళకు భారీ ఏర్పాట్లు



విద్యుత్ దీపాలతో అలంకరించిన దాచేపల్లిలో శ్రీ వీర్లంకమ్మ తల్లి దేవాలయం

దాచేపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఐదు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన దాచేపల్లిలోని శ్రీవీర్లంకమ్మ తల్లి తిరునాళ్ళకు భారీ ఏర్పాట్లను ఆలయ అభివృద్ధి కమిటీ చేపట్టింది. ఈనెల 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జరిగే తిరునాళ్ళలో భాగంగా వేలాది మందికి అన్నదానం నిర్వహించనున్నారు. పంచాయతీరాజ్, పోలీసు, విద్యుత్ శాఖ తమ ఏర్పాట్లను నిర్వహిస్తున్నారు. ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో తీర్చిదిద్దారు. ఈ ఐదు రోజుల పాటు గోవులకు, శ్రీపాతపాటేశ్వరి అమ్మవారు, సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఐదు రోజులపాటు ఎడ్ల పందాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు.

బైకును ఢీకొన్న లారీ - ఇరువురికి గాయాలు

వెల్దుర్తి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): బైకును లారీ ఢీకొనడంతో ఇరువురు వ్యక్తులు గాయపడిన సంఘటన మండలంలోని శిరిగిరిపాడులో జరిగింది. మండలంలోని దావుపల్లికి చెందిన శ్రావణ్‌నాయక్, రమావత్ చంద్రునాయక్‌లు బైకుపై వస్తుండగా శిరిగిరిపాడు చెక్‌పోస్టు వద్ద వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ సంఘటనలో శ్రావణ్‌నాయక్, చంద్రునాయక్‌లు గాయపడ్డారు. వీరిని మాచర్లలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు రిఫర్ చేశారు. వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



సమస్యలను ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి వివరిస్తున్న ప్రజలు

కబ్జాలపై ఉక్కుపాదం

● బుల్డోజర్‌తో కొట్టేయండి ● ఎమ్మెల్యే జూలకంటి ఫైర్

మాచర్లటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో మాచర్ల పట్టణంలో ఎక్కడ జాగా కనిపిస్తే అక్కడ కబ్జారాయుళ్లు రెచ్చిపోయి విచ్చలవిడిగా కబ్జాలకు పాల్పడ్డారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని వినాయకునిగుట్ట, 27వ వార్డులోని ఆజాద్‌నగర్ కాలనీ, 8, 9, 10, 11 వార్డుల్లో విస్తృతంగా పర్యటించారు. రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీలు, రోడ్ల పక్కన లేఅవుట్‌కు విరుద్ధంగా యథేచ్ఛగా కబ్జా చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రజల రాకపోకలకు ఆటకం కలిగించే ఏ ఒక్క కట్టడమైనా బుల్డోజర్‌తో తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబును ఆదేశించారు. కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాల్లో కట్టడాలు చేపడితే అవి ఏ దశలో ఉన్నా కూలివేయాలని సూచించారు. మరోసారి వార్డుల్లో పర్యటించే సమయానికి డ్రైనేజీలో ఉన్న మురుగంతా క్లీన్ చేసి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే సహించను

మాచర్ల మున్సిపాలిటీ పరిధిలో ప్రజా సమస్యలపై స్పందించకుంటే ఏ అధికారిని ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు. వినాయకునిగుట్ట, ఆజాద్‌నగర్, కళాకారుల కాలనీలో డ్రైనేజీ, వీధి దీపాలు సమస్యలు ఎక్కువగా ఉన్నాయని ప్రజలు ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. దీంతో మున్సిపల్ అధికారుల తీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఆక్రమణలతో, వ్యర్థాలతో డ్రైనేజీలు నిండిపోతుంటే వార్డుల్లో పర్యటించకుండా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. యుద్ధ ప్రాతిపదికన ప్రణాళికలు సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ వేణుబాబును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారుల, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

వెల్దుర్తి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. వెల్దుర్తికి చెందిన పాలపర్తి వీరప్పయ్యచారి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. వీరప్పయచారి టీడీపీ సభ్యత్వం తీసుకోవడంతో అతని కుటుంబానికి రూ.5లక్షల ప్రమాదబీమా మంజూరైంది. సంబంధిత నగదు చెక్కును, ఇన్సూరెన్స్ క్లయిమ్ ధ్రువపత్రాన్ని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మృతుని కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

న్యాయవాదిని ఏర్పాటు చేస్తాం

● న్యాయాధికారి ప్రియదర్శిని

పిడుగురాళ్ల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): గురజాలలోని సబ్‌జైలును స్థానిక 10వ అదనపు జిల్లాకోర్టు న్యాయాధికారి జి.ప్రియదర్శిని సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడుతూ సకాలంలో భోజనం, వైద్యసదుపాయాలు అందుతున్నాయా.. లేదా? అని అడిగి తెలుసుకున్నారు. కులవివక్షతో ఎవరైనా ప్రవర్తిస్తున్నారా? అని తెలుసుకున్నారు.న్యాయవాదులను పెట్టుకోలేనివారు తనకు తెలియజేస్తే ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం భోజనశాల, స్టోర్‌రూమ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో న్యాయసహాయ న్యాయవాది కలివెల ప్రభుదాసు, జైలు సూపరింటెండెంట్ అచ్చినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు త్వరితగతిన పరిష్కరించండి

● తహసీల్దార్ మధుబాబు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను గ్రామస్థాయిలో అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించేలా కృషిచేయాలని తహసీల్దార్ జె మధుబాబు తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని గ్రామాల రెవెన్యూ అధికారులతో మాట్లాడుతూ బాధితులు, రైతుల నుండి వచ్చే దరఖాస్తులను వాయిదా వేయకుండా పరిష్కరించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తే రెవెన్యూ అధికారులకు షోకాజ్ నోటీసులు ఇస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేలా కృషి చేయండి

● ఎంపీడీవో శివపార్వతి



పాఠశాలలో విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో శివపార్వతి

అమరావతి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య, పౌష్టికాహారం, ఉచిత దుస్తులు, పుస్తకాలు అందిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తుందని.. ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వపాఠశాలల్లో చేర్పించాలని ఎంపీడీవో శివపార్వతి అన్నారు. సోమవారం అమరావతిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఎల్ఇ)ను ఎంఈఓ శివబాబుతో కలసి సందర్శించారు. పాఠశాలలో అప్‌గ్రేడ్ అయిన విద్యార్థులను అభినందించి వారికి చాక్లెట్‌లు పంపిణీ చేశారు. పాఠశాల మోడల్ స్కూల్‌గా ఎంపిక కాగా సమీపంలోని మరో పాఠశాల నుండి 3,4,5 తరగతుల విద్యార్థులను ఈ పాఠశాలకు మార్చారు. ప్రతి తరగతికి ఓ ఉపాధ్యాయుడు ఉంటారని మంచి విద్యను అందిస్తారని తల్లిదండ్రులు గమనించి పిల్లలను మోడల్ స్కూల్‌లో చేర్పించాలని కోరారు. బోధనాసిబ్బంది కూడా పాఠశాలలో విద్యార్థులు సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. మండలంలో 12 పాఠశాలలను మోడల్ స్కూల్స్‌గా ఎంపిక చేశారన్నారు. రెండు యూపీ స్కూల్స్‌ను హైస్కూల్స్‌గా అప్‌గ్రేడ్ చేశారని ఎంఈఓ శివబాబు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.వెంకట్రావమ్మ, ఉపాధ్యాయినులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

సంక్షోభంలో.. నాపరాయి క్వారీలు

గ్రానైట్ రాకతో ఆదరణ కోల్పోయిన పరిస్థితి

ఉపాధి కోల్పోతున్న కార్మికులు



గొలిలోని నాపరాయి క్వారీ

మాచర్లటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పల్నాడులోని రెంటచింతల, గోలి, తుమ్మకోట, మల్లవరం, పశర్లపాడు, జెట్టిపాలెం, మాచర్ల, రాయవరం, మండాది, రచ్చమలపాడు, శ్రీరాంపురంతండా, బోదలవీడు గ్రామాల పరిధిలో నాపరాయి క్వారీలకు ప్రసిద్ధి. ఎంతో మందికి ఉపాధిని కల్పించిన ఈ నాపరాయి క్వారీలు కాలక్రమంలో ఆదరణ కోల్పోయాయి. ఈ క్వారీల వలన లారీ ట్రాన్స్‌పోర్టు, కూలీలకు మంచి ఉపాధి లభించేది. పల్నాడులో ఒకప్పుడు అత్యంత ఉపాధి కల్పించిన ఈ నాపరాయి క్వారీలు నేడు గ్రానైట్, యుత్రిఫైడ్ టైల్స్, వాల్ పేపర్లు రాకతో పూర్తిగా మరుగున పడిపోయి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. దీంతో దానిపై ఆధారపడి జీవించే డ్రైవర్లు, ఓనర్లు, కూలీలు దీన స్థితిలోకి వెళ్లిపోయే పరిస్థితి నెలకొంది.



గ్రానైట్స్ రాకతో...

మొదట్లో రాళ్లను చేతులతో తొలిచి మొలలు ద్వారా రాళ్లను చిన్నసైజు చేసేవారు. నాపరాయి పరిశ్రమ నుంచి రవాణాకు ఎద్దుల బండ్లను కూడా వాడేవారు. కాలక్రమేణా లారీలు, ట్రాక్టర్లు రావడంతో రాళ్లను సులభతరంగా తీసి రవాణా చేస్తున్నారు. నిత్యం నాపరాయి లోడింగ్, అన్‌లోడింగ్‌తో మూడు పూలు, ఆరు కాయలుగా పరిశ్రమ అభివృద్ధి చెందింది. కానీ నేడు ఆ పరిస్థితి భిన్నంగా ఉంది. వ్యాపారాలు లేక పరిశ్రమలు మూతపడుతున్నాయని వ్యాపారస్తులు ఆవేదన చెందుతున్నారు. వారం వచ్చిందంటే చాలు కూలీల ఖర్చులకు కూడా రావడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం గ్రానైట్, టైల్స్ వ్యాపారం అధికంగా ఉండడంతో నాపరాయి పరిశ్రమకు గడ్డు పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. వ్యాపారాలు సన్నగిల్లడంతో యజమానులు, కూలీలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపట్టిన అమరావతి రాజధాని నిర్మాణంలో నాపరాయిని వినియోగిస్తే తమకు మేలు జరుగుతుందని వ్యాపారస్తులు, కూలీలు పేర్కొంటున్నారు.



దాతృత్వానికి తిలోదకాలు

● మూతపడ్డ చావలి ఆయుర్వేద ఆసుపత్రి ● దెబ్బతింటున్న భవనం, రికార్డులు... సామగ్రి

వేమూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): దాతల దాతృత్వానికి తిలోదకాలు ఇస్తున్నారు అనడానికి చావలి ప్రభుత్వ వైద్యశాల భవనమే తార్కాణం. గ్రామంలో రెండేళ్ల క్రితం మూతపడ్డ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను తిరిగి ప్రారంభించేందుకు ఏ ఒక్కరూ ముందుకు రావడం లేదు. సంబంధించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు కూడా దీనిపై దృష్టి పెట్టడం లేదు. దీంతో భవనం చుట్టూ పిచ్చి మొక్కలు మొలచి శ్లాబ్, గోడలు దెబ్బతింటున్నాయి. ఆసుపత్రి లోపల ఉన్న రికార్డులు, సామగ్రి పాడైపోతున్నాయి. 1982లో ఆయుర్వేద వైద్యశాల నిర్మాణం కోసం గ్రామానికి చెందిన గాజుల మహాలక్ష్మమ్మ అమర్తలూరు పంచాయతీ సమితి ద్వారా స్థలాన్ని దానంగా ఇచ్చారు. నాటి హోంశాఖ మంత్రి కొణిజేటి రోశయ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 1985లో అప్పటి జెడ్పీ చైర్మన్ సక్కుర్తి రామయ్య వైద్యశాల భవనాన్ని ప్రారంభించారు. నాటి నుండి ప్రభుత్వ పర్యవేక్షణలో గ్రామస్తులకే కాకుండా చుట్టు పక్కల గ్రామాల వారికి ఆయుర్వేద వైద్య సేవలు 2022 వరకు అందాయి.

వైద్యశాలకు ప్రజాదరణ

ప్రతిరోజు రోగుల సంఖ్య 100కు పైగానే ఉండేది. దానికి తగ్గట్టుగానే ఆసుపత్రి సేవలను గుర్తించిన ప్రభుత్వం మందులను కూడా ఎప్పటికప్పుడు సరఫరా చేస్తూ ఉండేది. 2022లో ఇక్కడ పని చేసే సిబ్బందిని బదిలీ చేశారు. ఆ తర్వాత నియామకం జరగలేదు. కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలోని ఆయుష్ విభాగంలోని ఉన్నతాధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు కొనసాగినంత వరకు సేవలు పొందారు. ఇక్కడ పని చేసిన వైద్యులకు ప్రజాదరణతో పాటుగా ప్రభుత్వం నుంచి అవార్డులు కూడా అందాయి. ప్రస్తుత వైద్యశాల దుస్థితిని చూసి గ్రామస్తులు దాతల ఆశయాన్ని ప్రభుత్వం నీరుగారుస్తుందని, ఆయుర్వేద వైద్య సేవలు తమకు దూరం చేశారని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు భవన నిర్మాణం మరమ్మతులు చేయించడంతో పాటు తక్షణమే ఆయుర్వేద వైద్యుడు, తగిన సిబ్బందిని నియమించి పూర్వ వైభవాన్ని తీసుకు రావాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఆయుర్వేద ఆసుపత్రి భవనంపై మొలచిన పిచ్చి మొక్కలు



చావలిలో మూతపడ్డ ఆయుర్వేద ఆసుపత్రి



కమిషనర్ నరసింహారెడ్డిని జ్ఞాపిక, శాలువాతో సత్కరిస్తున్న నూతన కమిషనర్ సుజిత్ మల్లిక్, అధికారులు

సీజీఎస్టీ కమిషనర్ నరసింహారెడ్డి బదిలీ

● ఘనంగా వీడ్కోలు కార్యక్రమం

గుంటూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సీజీఎస్టీ గుంటూరు కమిషనర్ సాధు నరసింహారెడ్డి బదిలీ అయ్యారు. రెండేళ్ల పాటు పనిచేసిన ఆయనను హైదరాబాద్‌లో అప్పీల్స్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ఆ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు కన్నావారి తోటలో ఉన్న సీజీఎస్‌టీ కార్యాలయంలో కమిషనర్ నరసింహారెడ్డి వీడ్కోలు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లో ఉద్యోగులు అందించిన సమష్టి సహకారంతోనే రెవెన్యూ పరంగా సెంట్రల్ జీఎస్టీ శాఖను అగ్రస్థానంలో నిలబెట్టగలిగానని ఆనందం వ్యక్తం చేశారు. తన ఉద్యోగ జీవితంలో గుంటూరు కమిషనరేట్‌తో ఉన్న అనుబంధాన్ని ఎప్పటికీ మరువలేనన్నారు. అడిషనల్ కమిషనర్ బి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కమిషనర్ నరసింహారెడ్డి ఉద్యోగ బాధ్యతలతో పాటు, సేవా తత్పరునిగా సమాజానికి ఎంతో మేలు చేశారని కొనియాడారు. అసిస్టెంట్ కమిషనర్ ఎం నాగరాజు, గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నాయకులు కె.యుగంధర్, గాదె శ్రీనివాసరెడ్డి స్ఫూర్తి శాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిన అత్యంత అరుదైన ఐఆర్ఎస్ అధికారి నరసింహారెడ్డి అని పేర్కొన్నారు. అనంతరం ఉద్యోగులు కమిషనర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ బి.రవికుమార్, సూపరింటెండెంట్లు నవీన్ రాజు, చిదెళ్ల ఈశ్వరరావు, చిట్టి వెంకటేశ్వరరావు, కాకర్ల శ్రీనివాస్, పూర్ణ సాయి పాల్గొన్నారు.

నూతన కమిషనర్‌గా మల్లిక్, నేడు బాధ్యతల స్వీకారం

సీజీఎస్‌టీ గుంటూరు కమిషనర్‌గా సుజిత్ మల్లిక్‌ను నూతన కమిషనర్‌గా నియమించారు. భువనేశ్వర్‌లో సీజీఎస్‌టీ అడిషనల్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్న ఆయన్ను ఉద్యోగోన్నతిపై గుంటూరు కమిషనర్‌గా బదిలీ చేశారు. మంగళవారం సీజీఎస్‌టీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

రైల్వే కంబైన్డ్ రన్నింగ్ రూం ఆధునికీకరణ

● రూ.3.74 కోట్లు విడుదల చేసిన రైల్వే శాఖ
● కొత్తగా మరో 11 విశాంత్రి గదుల నిర్మాణం
● అంతటా త్రీస్టార్ సదుపాయాల కల్పన

గుంటూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే కంబైన్డ్ రన్నింగ్ రూం ఆధునికీకరణకు రైల్వేబోర్డు నిధులు మంజూరు చేసింది. ఇక్కడికి విశ్రాంతి కోసం సికింద్రాబాద్, రాజమండ్రి, విజయవాడ, రేణిగుంట, గుంతకల్లు, నంద్యాల నుంచి డ్యూటీపై వచ్చిన లోకో, అసిస్టెంట్ లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్‌లు వస్తున్నందున.. వారికి సకల సదుపాయాలు కల్పించాలని రైల్వే బోర్డు ఆదేశించింది. ఈ మేరకు తరచుగా రైల్వే అధికారులు రన్నింగ్ రూంని సందర్శిస్తూ అక్కడ లభిస్తున్న సదుపాయాలను మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం 19 గదుల్లో 38 పడకలు ఉన్నాయి. కొత్తగా మంజూరు చేసిన 11 గదుల్లో 22 బెడ్స్ అదనంగా రాబోతున్నాయి. దీంతో ఏకకాలంలో 60 మంది సిబ్బంది విశ్రాంతి తీసుకొనే అవకాశం ఏర్పడుతుంది. రైల్వే బోర్డు స్థాయిలో 2012లో, దక్షిణ మధ్య రైల్వే జోనల్ లెవల్‌లో 2024లో ఉత్తమ రన్నింగ్ రూం అవార్డు కూడా గుంటూరుకు దక్కడం విశేషం.

8 గంటల విశ్రాంతి తప్పనిసరి

రైళ్లలో విధులు నిర్వహించే ఎల్‌పీ, ఏఎల్‌పీ, టీఎంలకు సరైన విశ్రాంతి ఉంటేనే వాళ్లు సురక్షితంగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తారని రైల్వేబోర్డు భావిస్తోంది. ఈ మేరకు ఎనిమిది గంటల కంటే ఎక్కువ సమయం డ్యూటీ నిర్వహించిన సిబ్బందికి గుంటూరు కంబైన్డ్ రన్నింగ్ రూంలో తగిన విశ్రాంతిని కల్పిస్తారు. గుంటూరు రైల్వేస్టేషన్‌లో దిగిన ఇతర డివిజన్ల సిబ్బంది మళ్లీ డ్యూటీ ఎక్కాలంటే కనీసం 8 గంటల విశ్రాంతి ఉండాలి. ఈ మేరకు రన్నింగ్ రూంలోని గదులన్నింటిని ఎయిర్ కండీషనింగ్ చేశారు. ఒక్కో గదిలో రెండు పడకలుండగా వాటికి దోమ తెరలను అమర్చారు. మహిళా సిబ్బందికి ప్రత్యేకించి రెండు గదులను కేటాయించి, వాటికే అటాచ్డ్ బాత్‌రూంలను ఏర్పాటు చేశారు. గీజర్, వాషింగ్ మెషిన్, ఐరన్ బాక్సు సదుపాయలను కూడా కూడా కల్పించారు. ఒక్క నిమిషం కూడా విద్యుత్ సరఫరా నిలిచిపోకుండా ఉండేందుకు ఆటోమేటిక్ బ్యాకప్ జనరేటర్‌ని ఏర్పాటు చేశారు. సోలార్ విద్యుత్‌ని కూడా వినియోగిస్తున్నారు.



కామన్ టాయ్‌లెట్స్



వెయిటింగ్ హాల్



లాబీ, ఆటోమేటిక్ బ్యాకప్ జనరేటర్

రీడింగ్ రూంలో దినపత్రికలు, పుస్తకాలు

లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు పుస్తకాలు, దిన పత్రికలు చదువుకునేందుకు ఒక రీడింగ్ రూమ్‌ని ఏర్పాటు చేశారు. అక్కడ తెలుగు, హిందీ, ఆంగ్ల దిన పత్రికలు, వీక్లీ మ్యాగజైన్లు అందుబాటులో ఉంచుతున్నారు. అలానే పుస్తకాలు కూడా వారికి ఇస్తున్నారు. ధ్యానం చేసుకొనేందుకు ఒక మెడిటేషన్ హాల్‌ని కూడా ఏర్పాటు చేశారు.

హైజినిక్ కిచెన్, డైనింగ్ హాల్

కోచింగ్ సిబ్బందికి నాణ్యమైన ఆహారాన్ని ఆరోగ్యకరమైన వాతావరణంలో వడ్డించేందుకు హైజినిక్ కిచెన్, డైనింగ్ హాల్‌ని ఏర్పాటు చేశారు. ఒకేసారి 12 మంది సిబ్బంది రౌండ్ టేబుల్ చుట్టూత కూర్చుని భోజనం చేయొచ్చు. బ్రాండెడ్ సరుకులనే ఆహార పదార్థాల తయారీకి వినియోగిస్తున్నారు. రోజుకొక మెనూని నిర్ణయించి, ఈ మేరకు ఆహార పదార్థాలు వండి పెడుతున్నారు. త్వరలో కిచెన్, డైనింగ్ హాల్స్‌ని కూడా ఎయిర్ కండీషనింగ్ చేయనున్నారు. పరిశుభ్రమైన తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్‌ని ఏర్పాటు చేశారు. అలానే తాగే నీరు చల్లగా ఉంచేందుకు కూలర్, వేడినీళ్లు కావాలనుకొనేవారికి ప్రత్యేక యంత్రం ఏర్పాటు చేశారు.

సీసీ టీవీలో పర్యవేక్షణ

రన్నింగ్ రూం అంతటా సీసీ టీవీలను అమర్చారు. గదుల్లో సిబ్బంది సక్రమంగా విశ్రాంతి తీసుకొంటున్నారా, ఏమైనా ఫోన్లు చూసుకొంటూ కాలం గడిపేస్తున్నారా అనేది కూడా పర్యవేక్షిస్తున్నారు. కారిడార్‌లో పిచ్చాపాటిగా తిరుగుతున్నారా అనేది కూడా చూస్తున్నారు. ఒకసారి లోనికి వచ్చిన తర్వాత ఎనిమిది గంటల విశ్రాంతి పూర్తి అయ్యేంత వరకు సిబ్బందిని బయటకు పంపించరు.

పరీక్షల అనంతరం అవుట్ సోర్సింగ్ సిబ్బంది నియామకం

రన్నింగ్ రూంలో పని చేసే అవుట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించుకునే ముందు రైల్వే మెడికల్ ఆఫీసర్ల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. వాళ్లకు ఎలాంటి వ్యాధులు లేవని సర్టిఫికేట్ ఇస్తేనే విధుల్లోకి తీసుకొంటారు. అలానే ఎలాంటి నేర చరిత్ర లేదని పోలీసు శాఖ నుంచి ధ్రువీకరించుకొన్న తర్వాతే నియమిస్తారు.

విభజన కష్టాలు

ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ (ఏపీ సీపీడీసీఎల్) లిమిటెడ్ సంస్థలోని కొత్త సర్కిల్స్ విభజన కష్టాలు ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదు. సర్కిల్స్ విభజన జరిగి దాదాపు ఆరు నెలలు పైగా గడుస్తున్నా.. సమస్యలు మాత్రం వెంటాడుతూనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలోనే ఏపీ సీపీడీసీఎల్‌లో సర్కిల్స్ విభజనకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వంలోనే చేయాల్సిన విభజన కేవలం ప్రతిపాదన దశలోనే ఉండగా.. కార్యరూపంలోకి తీసుకొచ్చింది.

◆ ఆర్నెల్ల క్రితం ఏపీ సీపీడీసీఎల్‌లో కొత్త సర్కిల్స్ ఏర్పాటు
◆ కొత్తకార్యాలయాలను వేధిస్తున్న ఉద్యోగుల కొరత, వసతులు
◆ ఉద్యోగుల సర్దుబాటుపై కసరత్తు, నెలాఖరుకు డెడ్‌లైన్
◆ ఔట్ సోర్సింగ్‌లో బదిలీలపై ఆందోళన
◆ నేతల సిఫార్సులతో తలలు పట్టుకుంటున్న అధికారులు

గుంటూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సీపీడీసీఎల్ పరిధిలో కృష్ణా జిల్లా మచిలీపట్నంలో కొత్త సర్కిల్‌ను ఏర్పాటు చేశారు. ఇక ఉమ్మడి గుంటూరు సర్కిల్‌లో కొత్తగా పల్నాడు సర్కిల్, బాపట్ల సర్కిల్ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే సర్కిల్స్‌కు ఎస్ఈలను, ఈఈలను ప్రభుత్వం నియమించింది. ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకొని ఆయా సర్కిల్ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. అయితే నెలలుగా కార్యాలయాల్లో సరిపడా ఉద్యోగులు లేక కార్యకలాపాలు ముందుకు సాగే పరిస్థితి కనిపించటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కనీసం ఆయా కార్యాలయాల్లో నెట్‌వర్క్ వంటి మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించలేదని ఉద్యోగుల నుంచే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే.. ఆరు నెలల తర్వాత ఆయా కార్యాలయాలకు ఉద్యోగులను సర్దుబాటు చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.

విభజనపై విమర్శలు


ఇదిలా ఉంటే ప్రభుత్వం పరిపాలనా పరంగా జిల్లాలు, నైసర్గిక స్వరూపాల విభజనకు భిన్నంగా సీపీడీసీఎల్‌లో సర్కిల్స్ విభజన జరిగిందన్న విమర్శలు ఉన్నాయి. పల్నాడు జిల్లాలో ఉన్న చిలకలూరిపేట సబ్ డివిజన్ నేటికీ సీఆర్‌డీఏ సర్కిల్‌లోనే కొనసాగుతోంది. ఇక రేపల్లె సబ్ డివిజన్ బాపట్ల సర్కిల్ కు వెళ్లాల్సి ఉండగా నేటికీ గుంటూరు సర్కిల్‌లోనే కొనసాగుతోంది. ఇలా కొన్ని సబ్ డివిజన్‌లు, సెక్షన్‌లు పాత జిల్లాల పరిధిలోనే కొనసాగుతుండటంపైనా కొందరు అభ్యంతరాలు లేవనెత్తుతున్నారు.

సర్దుబాటుపై కసరత్తు

ఇక ఉద్యోగుల సర్దుబాటు ప్రక్రియపై ఇప్పటికే కసరత్తు ప్రారంభమైంది. పలువురు జేఏసీలు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లను కొత్త సర్కిల్స్‌కు బదిలీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. బదిలీ ప్రక్రియకు ఈ నెలాఖరు వరకు గడువు విధించినట్లు తెలిసింది. ఇప్పటికే అనేక మంది ఉద్యోగుల జాబితాను సిద్ధం చేశారు.

బదిలీలపై ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆందోళన

ఇక సర్కిల్ కార్యాలయాల్లో పనిచేసే పొరుగు సేవల (ఔట్ సోర్సింగ్) ఉద్యోగుల బదిలీలకు కూడా రంగం సిద్ధం చేయడం కొంత గందరగోళానికి దారితీస్తోంది. జిల్లా కేంద్రం గుంటూరు సర్కిల్ కార్యాలయంలో 31 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉంటే ఇందులో దాదాపు 15 మంది వరకు ఉద్యోగులను పల్నాడు సర్కిల్ కార్యాలయ కేంద్రం నరసరావుపేటకు బదిలీ చేసేందుకు జాబితాను సిద్ధం చేసినట్లు సమాచారం. ఇక కొత్తగా ఏర్పడిన బాపట్ల సర్కిల్‌కు కూడా ఒంగోలు సర్కిల్ కార్యాలయం నుంచి ఉద్యోగులను బదిలీ చేయాలని ఆదేశాలు ఉన్నాయి. దాంతో ఒంగోలు సర్కిల్ కార్యాలయంలో 33 మంది ఉద్యోగులు ఉంటే వారిలో పది మంది మందికి పైనే బాపట్లకు బదిలీ చేయాలని జాబితా సిద్ధం చేసినట్లు తెలిసింది. అసలే అరకొర జీతాలతో నెట్టుకొస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను బదిలీల జాబితాలో చేర్చడం అన్యాయమంటూ వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వాస్తవానికి సాధారణ బదిలీల సమయాల్లో రెగ్యులర్ ఉద్యోగులకే ఈ ప్రక్రియ ఉంటుందని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు బదిలీల విధానమే ఉండదని వారు గుర్తుచేస్తున్నారు. చాలీ చాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తుంటే జిల్లాలు దాటి ప్రయాణాలు చేయాలంటే వచ్చే జీతంలో సగం జీతం ఛార్జీలతో సరిపోతాయని వారు వాపోతున్నారు. కొందరు ఉద్యోగులు దశాబ్దాలుగా పనిచేస్తున్నా.. కనీస జీతాలు కూడా రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, గుంటూరు సర్కిల్ కార్యాలయంలో బదిలీల జాబితాలో 70 శాతం మంది మహిళా ఉద్యోగులే ఉండటం విశేషం. మహిళా ఉద్యోగులు అత్యధికశాతం ఉండటంతో అధికారులకు కొంత ఇబ్బందికరంగా మారిందని చెబుతున్నారు.



నేతల సిఫార్సులు

ఇక బదిలీల నుంచి తప్పించుకునేందుకు కొందరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అధికార పార్టీ నేతల నుంచి కూడా సిఫార్సులు చేయించుకుంటున్నారు. కొందరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చేస్తోన్న సిఫార్సులు ఏ స్థాయిలో ఉంటున్నాయంటే అధికారులే తలలు పట్టుకునే పరిస్థితి ఉందని ఓ అధికారి వ్యాఖ్యానించారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో ఉమ్మడి గుంటూరు సర్కిల్ పరిధిలో గుంటూరు -2 డివిజన్, అమరావతి డివిజన్‌లను కలిపి కొత్తగా సీఆర్‌డీఏ సర్కిల్‌ను ఏర్పాటు చేశారు. ఆ సమయంలో సర్కిల్ కార్యాలయంలో పనిచేసేందుకు ఉద్యోగుల కోసం కొత్తగా నియామకాలను చేపట్టారు. ఇలా వేరొక సర్కిల్ నుంచి ఉద్యోగుల బదిలీల వ్యవహారం లేదని గుర్తు చేస్తున్నారు. డివిజన్ కార్యాలయాల్లో ఉన్న వారిని సర్దుబాటు చేసుకొని, సర్కిల్ కార్యాలయానికి కొత్తగా నియామకాలతో ఉద్యోగులను నియమించుకున్నారని, అటువంటి ప్రక్రియ వదిలేసి వేరొక జిల్లా నుంచి సిబ్బందిని బదిలీ చేయడం సరికాదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆటో వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో చలివేంద్రం

వినుకొండ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు రైల్వేస్టేషన్‌కు వచ్చే ప్రయాణికులకు స్నేహ మిత్ర రైల్వే ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ వద్ద సోమవారం చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. రైల్వే బుకింగ్ అధికారి బి.నాగవల్లి ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైల్వే ఆటో వర్కర్స్ యూనియన్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఫ్రాన్సిస్, కార్యదర్శి వెంకటేశ్వర్లు, రవితో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నేడు సాయి నగర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేత

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి), సత్తెనపల్లి రోడ్డులోని అయ్యప్ప స్వామి గుడి ఎదురుగా సాయిరాం 2, సాయిరాం 3, సాయి నగర్ 5వ లైన్‌లలో మంగళవారం ఉదయం 7గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సోమవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించవలసిందిగా ఆయన కోరారు.

నేర నివారణపై వర్టికల్ టీవీలో అవగాహన

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రకాష్ నగర్‌లోని టౌన్ హాల్లో సోమవారం ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వర్టికల్ టీవీ ద్వారా నేర నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పోలీస్ శాఖ తరపున మొదటి పట్టణ పోలీసులు నేర నివారణపై పల్నాడు జిల్లా పోలీసులు ప్రత్యేకంగా రూపొందించిన మీతో మేము కార్యక్రమం జరిగింది. ఇందులో సైబర్ నేరాలు అదుపు, డ్రగ్స్ నివారణ, సేవించడం వల్ల సంభవించే నష్టాలు, వేసవిలో నేరాలు జరగకుండా నివారించే విధివిధానాలను వివరించారు. కార్యక్రమంలో మొదటి పట్టణ సీఐ, ఎంవీ చరణ్, ఎస్‌లు వంశీకృష్ణ, అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

నాదెండ్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఐదు సంవత్సరాలు నిండిన విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ అన్నారు. మండలంలోని గొరిజవోలులో పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా పిల్లలకు ప్రీ స్కూల్ సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చదివిస్తే ఆర్థికభారం ఉండదని, ఒత్తిడి లేకుండా చదువుకుంటారన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు అనురాధ, సౌజన్య, అంగన్‌వాడీలు నిర్మల, శ్రీలక్ష్మి, యామిని తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని రెండు గేదెలు మృతి

వినుకొండ టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపాలెం సమీపంలో జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని రెండు పాడిగేదెలు మృతి చెందిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గుర్తుతెలియని వాహనం ఢీకొని రెండు పాడిగేదెలు మృతిచెందాయన్న సమాచారం మేరకు హైవే సిబ్బంది సంఘటనా ప్రాంతానికి చేరుకొని రోడ్డుపై అడ్డంగా పడి ఉన్న గేదెల మృతదేహాలను తొలగించి రాకపోకలకు ఆటంకం లేకుండా తగిన చర్యలు తీసుకున్నారు. గేదెలు ఎవరివి అన్నవి గుర్తించాల్సి ఉంది.

ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు

రొంపిచర్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు సోమవారం చేరారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలల నుంచి చేరారు. పలు గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎంఈవో బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. సంతగుడిపాడు, విప్పర్ల, తుంగపాడు, అన్నవరం తదితర గ్రామాల్లో గల పాఠశాలల్లో కార్యక్రమం జరిగింది.

నేడు మైదవోలు పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల

యడ్లపాడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మైదవోలు-లింగారావుపాలెం మార్గంలోని పోలేరమ్మ అమ్మవారి ఆలయం వార్షిక తిరునాళ్ళ మహోత్సవం మంగళవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ తిరునాళ్ళ సందర్భంగా విద్యుత్ ప్రభలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నదానం కూడా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

చిన్నరథం పునర్నిర్మాణానికి వినాయక ట్రస్ట్ సాయం

చిలకలూరిపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారపు కొట్ల బజారులో ఉన్న శ్రీసీతారాముల దేవస్థానానికి సంబంధించిన చిన్న రథం పునర్నిర్మాణానికి శ్రీవినాయక ట్రస్ట్ వారు ముందుకు వచ్చారు. ఇందుకు సుమారు రూ.40లక్షల వరకు ఖర్చు కాగలదని అంచనా. ప్రస్తుతం ఉన్న రథం శిథిలావస్థకు చేరింది. శ్రీసీతారాముల దేవస్థానం దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో ఉంది. దీంతో వినాయక ట్రస్ట్ సభ్యులు చంద్రపట్ల మణికుమార్, పొట్టి రత్నబాబు, కొల్లా ఉమ, పొట్టి మహేంద్ర రాజా తదితరులు కొత్తరథం నిర్మాణానికి అనుమతి కోరుతూ గుంటూరులోని దేవాదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందచేశారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు, ఇతర అధికారులు

నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదు

● కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, బాధ్యులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పీ అరుణ్‌బాబు హెచ్చరించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నరసరావుపేట పట్టణంలోని టౌన్ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ పీ అరుణ్‌బాబు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే వినతులను, తమ సొంత సమస్యగా భావించి నాణ్యమైన, శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ పీ అరుణ్‌బాబు అన్నారు. సమస్యల పరిష్కారంలో వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో క్షుణంగా పరిశీలించి, 48 గంటలలో పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 410 మంది అర్జీదారుల నుంచి వినుతులను కలెక్టర్ స్వీకరించి సమస్యలను సావధానంగా విని, పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జిల్లా రెవెన్యూ అధికారి మురళి, ఆర్డీవో మధులత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పీ అరుణ్ బాబు అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ప్రజా సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం తరుచూ పర్యవేక్షిస్తోందని, దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి సమస్యను సొంత సమస్యగా భావించినప్పుడే శాశ్వత పరిష్కారం చూపగలరన్నారు. అర్జీల పరిష్కారాన్ని వేగవంతం చేసే ప్రక్రియలో ఎటువంటి తప్పిదాలకు తావివ్వరాదన్నారు. పరిష్కారమయ్యే సమస్యలతో అర్జీదారులు సంతృప్తి చెందాలని, ఎట్టి పరిస్థితులలో అర్జీలు పునః ప్రారంభం కారాదని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

పండుగలా తరగతోన్నతి జరగాలి

● కలెక్టర్ అరుణ్‌బాబు



అంగన్‌వాడీ పిల్లలతో మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన డీఈవో, ఆర్డీవో

నరసరావుపేట కల్చరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఒక తరగతి నుంచి ఇంకో తరగతికి విద్యార్థుల తరగతోన్నది (ట్రాన్సిషన్) పాఠశాలల్లో పండుగ వాతావరణంలో జరగాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు అన్నారు. సోమవారం పట్టణంలోని స్థానిక మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ట్రాన్సిషన్ కార్యక్రమంలో పాల్గొని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం కార్యక్రమం గురించి ఆయన వివరిస్తూ తొలుత అంగన్‌వాడీలలోని 5 ప్లస్ పిల్లలను ప్రైమరీ పాఠశాలకు పిలిపించి వారిని 1వ తరగతిలో కూర్చోబెట్టి సంబంధిత తరగతి ఉపాధ్యాయులు ఆసక్తి కలిగించే కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న పిల్లలను ప్రస్తుతం వారు చదువుతున్న తరగతి నుంచి పైతరగతి ఉపాధ్యాయులకు అప్పగించాలి. అలాగే 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలకు, 7 లేదా 8వ తరగతి చదువుతున్న విద్యార్థులను ఉన్నత పాఠశాలలకు తీసుకెళ్లి వారిని సంబంధిత తరగతి ఉపాధ్యాయులకు అప్పగించాలన్నారు. ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు స్వాగత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు చాకోలెట్స్, స్వీట్స్ పంపిణీ చేయాలన్నారు. ఈ ట్రాన్సిషన్ కార్యక్రమానికి గ్రామ పెద్దలు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, అధికారులను, ఎన్జీవోలను ఆహ్వానించాలన్నారు. వారికి పాఠశాలలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, మౌలిక సదుపాయాల గురించి తెలియజేయాలన్నారు. పాఠశాలల్లో నమోదు పెంచేందుకు వారి సహాయ సహకారాలు అభ్యర్థించాలన్నారు. కార్యక్రమంలో డీఈవో చంద్రకళ ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఏఎస్పీ సంతోష్

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 94 ఫిర్యాదులు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పరిపాలన అదనపు ఎస్పీ జేవీ సంతోష్ నిర్వహించారు. వివిధ అంశాలకు సంబంధించి 94ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడానికి తగుచర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత పోలీస్ అధికారులకు అదనపు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. నరసరావుపేట పెద్దచెరువు ఇందిరాగాంధీ బొమ్మ వద్ద నివాసం ఉండే ఆనంద్ ఇల్లు కొనుగోలు చేసే ఆలోచనలో ఉండగా నారాయణ మరో గుర్తు తెలియని వ్యక్తితో కలిసి పాలపాడు రోడ్డులోని వెంచర్‌లో నాలుగు సెంట్లు ఇల్లు ఉందని రూ.35లక్షలకు వస్తుందని నమ్మించి ఓనర్‌కు అడ్వాన్స్ ఇప్పించారని ఇంటి రిజిస్ట్రేషన్‌కు రాకుండా తనకు నగదు ఇవ్వకుండా బెదిరిస్తున్నారని న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. పట్టణంలోని కొండలరావుపేటకు చెందిన మల్లికార్జున్ మార్కెట్ సెంటర్‌లో కుమారస్వామి లాడ్జి నడుపుతున్నాడు. గుంటూరుకు చెందిన నారపుశెట్టి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి తన లాడ్జికి వచ్చి తాను విలేకరిగా పని చేస్తున్నానని చాలామందిని విదేశాలకు పంపానని అందరూ మంచి ఉద్యోగాలలో స్థిరపడ్డారని నమ్మించి తనకు కూడా మంచి ఉద్యోగం ఇప్పిస్తానని తన వద్ద లక్షల కొద్దీ నగదు తీసుకున్నాడని, ఉద్యోగం ఇప్పించకుండా నగదు ఇవ్వకుండా బెదిరిస్తున్నాడని తగు న్యాయం చేయాలని ఫిర్యాదుచేశారు. శ్యావల్యాపురం మండలం పోట్లూరు గ్రామానికి చెందిన పాపాబత్తిని అలివేలును ఆమె మరిది బావలు హింసిస్తున్నారని న్యాయం చేయాలని ఫిర్యాదుచేశారు. చిలకలూరిపేటకు చెందిన జరుకుమల్లి అరుణ్ సంజీవ్ అంబేద్కర్ ఎమ్మెల్సీ చదివే సమయంలో పరిచయం ఉన్న కృష్ణా జిల్లా ఘంటసాల మండలం పాపవినాశనం గ్రామానికి చెందిన సాగర్ సెరీకల్చర్ వ్యవసాయంలో అధిక లాభాలు వస్తాయని నమ్మించి తన వద్ద తన తండ్రి వద్ద రూ.34లక్షలు వారి ఖాతాకు ట్రాన్స్ఫర్ చేయించుకున్నాడన్నారు. తీసుకున్న మొత్తం ఇవటం లేదని తగు న్యాయం చేయాలని ఫిర్యాదుచేశారు. రొంపిచర్ల మండలం వీరపట్నం పంచాయతీ చెందిన ఏలూరు రాంప్రసాద్ గోపు అంజిరెడ్డికి తన పొలాన్ని తాకట్టు పెట్టి కొంత నగదు తీసుకున్నాడు. అనంతరం వడ్డీతో సహా చెల్లించినా పొలాన్ని గోపు అంజిరెడ్డి మోసం చేసి తన పేరు మీద ఆన్‌లైన్ చేయించుకున్నాడని దీనిపై ప్రశ్నించినందుకు తనను బెదిరించి దుర్భాషలాడి దాడి చేశాడని ఫిర్యాదు చేశాడు.

టైరు పంక్చరై మినీ ట్రక్ బోల్తా



జాతీయరహదారిపై బోల్తా పడిన మినీట్రక్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ శివరామకృష్ణ

యడ్లపాడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిపై యడ్లపాడు మండలం తిమ్మాపురం వద్ద ప్రమాదవశాత్తు మినీ ట్రక్ బోల్తాపడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గల మినీ ట్రక్ ఒంగోలు నుంచి గుంటూరుకు టైల్స్ తీసుకెళుతోంది. యడ్లపాడు మండలం తిమ్మాపురం వద్ద వెనుక టైరు పంక్చర్ కావడంతో వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి జాతీయ రహదారిపై బోల్తాపడింది. దీంతో వ్యాన్‌లోని టైల్స్ జాతీయ రహదారిపై చెల్లాచెదురుగా పడిపోయాయి. డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బోల్తాపడిన వ్యానును పక్కకు తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

'బొప్పూడి గ్రానైట్ క్వారీలో అక్రమాలపై విచారణ చేయండి'

చిలకలూరిపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం బొప్పూడిలో ఉన్న రెండు ప్రముఖ గ్రానైట్ క్వారీలలో అక్రమాలు జరిగాయని పట్టణంలోని పోలిరెడ్డిపాలెంకు చెందిన నార్నె హనుమంతరావు తదితరులు సోమవారం నరసరావుపేటలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు అందచేశారు. ఈ క్వారీల వారు రోడ్డు మెటల్ ఖనిజాన్ని అక్రమంగా తరలించారని వారు పేర్కొన్నారు. ఈ క్వారీలలో అనుమానాస్పదరీతిలో కొందరు గతంలో చనిపోయినా సరైన విచారణ జరగలేదని వారు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్వారీలలో మైనింగ్ అనుమతుల ప్రకారమే కార్యకలాపాలు జరిగాయో లేదో పరిశీలించాలని కోరారు. వీరు బొప్పూడి నుంచి ఖనిజాన్ని బోయపాలెం, నాగరాజుపల్లిలోని వారికి సంబంధించిన క్రషర్లకు తరలించి సొమ్ము చేసుకున్నారని వివరించారు. ఉన్నతాధికారులు ఈ క్వారీలలో టెస్ట్ రన్ జరిపి ఎన్ని క్యూబిక్ మీటర్లకు, ఎన్ని యూనిట్ల విద్యుత్తు బిల్లు అవుతుందో పరిశీలించాలని, దాని ప్రకారం గత సంవత్సరాలలో జరిగిన అక్రమ వ్యాపారాల గుట్టు తెలుసుకోవాలన్నారు. దీనికి తోడు క్వారీలలో గతంలో పేలుడు పదార్థాలు కూడా వాడారని, వీటికి సరైన అనుమతులు ఉన్నాయో లేదో కూడా పరిశీలించాలని కోరారు. పూర్తిస్థాయి విచారణ జరిగే వరకు ఈ క్వారీలలో కార్యకలాపాలను నిలిపివేయాలని వారు అభ్యర్థించారు.

జేఈఈ మెయిన్స్‌లో వాగ్దేవి విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాలలో వాగ్దేవి విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. రాట్ల జాస్పర్ 650 ర్యాంక్, ఆకుల సాయి 1200 ర్యాంక్, గుండాల సిరి 1545 ర్యాంక్, కొలకోట్ల మహేష్ 4155 ర్యాంక్, రామవత్ మోహన 5250 ర్యాంక్, గుండాల యువరాజ్ 7245 ర్యాంక్ సాధించారన్నారు. విద్యార్థులు టాప్ ఎన్ఐటీలు, ట్రిబుల్ ఐటీలలో టాప్ 20 కాలేజీలలో సీట్లు సాధిస్తారన్నారు. విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, కపిలవాయి రాజేంద్రప్రసాద్, పాశం కృష్ణారావు, పీవీ అచ్యుతరావు, అధ్యాపకులు అభినందించారు.

నరసరావుపేట నారాయణ విద్యార్థికి 17వ ర్యాంక్

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో నరసరావుపేట నారాయణ కళాశాల విద్యార్థి ఆర్ హరి చరణ్ నాయక్ ఆల్ ఇండియా 17వ ర్యాంక్ సాధించారని ప్రిన్సిపాల్ షేక్ మున్నీర్‌భాషా సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి ఆర్.హరిచరణ్ నాయక్‌ను ఆర్‌జీఎం శ్రీనివాసరెడ్డి, డీన్ సుభాని, ఏజీఎం రమకృష్ణ, వైఎస్ ప్రిన్సిపాల్ శ్రావణ్, ఏవో నల్లపాటి వెంకటేశ్వర్లు అభినందించారు.

వెల్లలచెరువు వాసి నేత్రదానం



యల్లమందాచారి (ఫైల్‌ఫొటో)

వేల్పూరు (శావల్యాపురం) ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శావల్యాపురం మండలం వేల్పూరుకు చెందిన వెల్లలచెరువు యలమందాచారి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. యలమందాచారి అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. అమ్మ నేత్ర, అవయవ, శరీరదాన ప్రోత్సాహకుల సంఘం జిల్లా కో-ఆర్డినేటర్ సంద్రపాటి చలపతిరావుకు కుటుంబ సభ్యులు సమాచారం అందించటంతో ఆయన పెదకాకాని శంకర్ ఆసుపత్రికి సమాచారం అందిచారు. దీంతో సిబ్బంది మృతుని కళ్లలోని పొరను సేకరించారు. చలపతిరావు మాట్లాడుతూ యల్లమందాచారి కమ్యూనిస్టు భావాలు కలిగిన వ్యక్తని, 50కిపైగా పౌరాణిక నాటకాల్లో వివిధ పాత్రలను పోషించి ప్రజలను మెప్పించారన్నారు. నేత్రదానంతో యల్లమందాచారి కుటుంబసభ్యులు పలువురికి ఆదర్శంగా నిలిచారన్నారు. నేత్రదానం చేసిన యల్లమందాచారి కుటుంబ సభ్యులు సీతమ్మ, శంకరం, రాధ, బ్రహ్మంలను చలపతిరావు, గ్రామస్థులు అభినందించారు.


యానాదులను బెదిరించడం దారుణం

● వినుకొండ నియోజకవర్గ సీపీఐ నేత శ్రీనివాసరావు



ఎన్నెస్పీ ఏఈ లక్ష్మీనారాయణతో మాట్లాడుతున్న సీపీఐ నేత శ్రీనివాసరావు

వెలమావారిపాలెం (శావల్యాపురం) ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బతుకు తెరువు కోసం చేపలు పట్టుకొంటున్న యానాదులను ఎన్నెస్పీ అధికారులు బెదిరించటం దారుణమని వినుకొండ నియోజకవర్గ సీపీఐ నాయకులు బూదాల శ్రీనివాసరావు సోమవారం ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామపంచాయతీ పరిధిలోని వెలమావారిపాలెం ఎస్టీకాలనీకి చెందిన యానాదులు గ్రామానికి సమీపంలోని ఎన్నెస్పీ కెనాల్‌లో నిలిచిపోయిన నీటిలో చేపలు పట్టుకుంటుండగా ఎన్నెస్పీ ఏఈ లక్ష్మీనారాయణ చేపలు పట్టడానికి వీల్లేదని, కెనాల్‌లో చేపలు పట్టుకొనేందుకు వేలం నిర్వహించామని, పోలీసు కేసులు పెడతామని యానాదులను బెదిరించారని తెలిపారు. దీనిపై తాము వేలం ఎప్పుడు నిర్వహించారని, దానికి సంబంధించిన ప్రకటన ఇవ్వమని బాధితుల తరఫున ఏఈని అడిగితే మీకు సమాధానం చెప్పాల్సిన అవసరంలేదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారన్నారు. ఉన్నతాధికారులు దీనిపై స్పందించి ఏఈపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే సీపీఐ ఆధ్వర్యంలో నరసరావుపేట ఎన్నెస్పీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు హవీలా

హిందీ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం

వినుకొండ టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షలతో పాటు, హిందీ భాషా ప్రవీణకు అర్హత సాధించిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం హవీలా సోమవారం దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాభ్యాసంతో పాటు పదో తరగతిలో బి.పినేహాస్, ఎస్‌కే మహమ్మద్ ఇర్ఫాన్, టి.ప్రసాద్, పి.రవికుమార్, పి. రామచరణ్, రవికిరణ్‌లతో పాటు 9వ తరగతి చదువుతున్న కె.ధనుష్‌లు హిందీ పరీక్షలలో ప్రతిభ చూపటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు సుదర్శన్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రోడ్డుకు అడ్డంగా పడిన భారీ వేపచెట్టు

యడ్లపాడులో నేల వాలిన మహావృక్షం

యడ్లపాడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సుమారు రెండు శతాబ్దాల నాటి మహావృక్షం నేలవాలింది. స్థానికులు మహాలక్ష్మీ అమ్మవారిగా భావించి ఈ చెట్టుకు నిత్యం పూజలు చేసేవారు. ఎటువంటి గాలి, వర్షం లేకుండా ఒక్కసారిగా మహావృక్షం నేలకూలింది. వివరాలలోకి వెళితే... యడ్లపాడులోని మేదర బజారులోని మహేంద్రసంఘ భవనం సమీపంలో భారీ వేపచెట్టు ఉంది. స్థానికులు ఈ వృక్షం చుట్టూ కూర్చునేందుకు వీలుగా సిమెంటుతో ప్లాట్‌ఫాం కట్టించి మహాలక్ష్మీ అమ్మవారిగా కొలుస్తున్నారు. ఈ చెట్టుకు నిత్యం పూజలు చేస్తూ, పగలు ఈ చెట్టు కింద కూర్చుని మేదర వృత్తి పనులు చేసుకునేవారు. ఈదురు గాలులు, భారీ వర్షాల సమయంలోనూ ఈ చెట్టు కొమ్మలు విరగలేదు. అయితే ఎటువంటి గాలులు, వర్షాలు లేకుండానే దానంతట అదే ఒక్కసారి మొదలు మధ్యకు విరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. సమీపంలో ఉన్న విద్యుత్ తీగలపై పడడంతో తీగెలు తెగిపోయాయి. స్థానికులు గమనించి విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చెట్టు విరిగిపడే సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

సివిల్స్ విద్యార్థులకు శివశక్తి ఫౌండేషన్ శిక్షణ



సివిల్స్ శిక్షణకు ఎంపికైన విద్యార్థులతో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐఏఎస్, ఐపీఎస్ లక్ష్యంగా పరీక్షలకు సిద్ధమవుతున్న 13మంది విద్యార్థులను ఉచిత శిక్షణకు ఎంపిక చేసినట్లు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ చీఫ్‌విప్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విద్యార్థుల అభినందన సభలో జీవీ మాట్లాడుతూ మంచి లక్ష్యం కోసం కలిసి వస్తున్న ఐఏఎస్ స్టడీ సర్కిల్ అధినేత డాక్టర్ లక్ష్మయ్యను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఎంపికైన వారికి శిక్షణ అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు లక్ష్మయ్య తెలిపారు. వసతి, భోజనం శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సివిల్స్ ఉచిత శిక్షణకు ఎంపికైన పలువురు విద్యార్థులకు జీవీ ఆంజనేయులు అభినందనలు తెలిపారు. ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవలను వినియోగించుకొని జీవితంలో ఉన్నతస్థానం అధిరోహించాలని ఆకాంక్షించారు.

ప్రశాంతంగా 6వ తరగతి ప్రవేశ పరీక్షలు

రొంపిచర్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెడ్డిపాలెంలోని మోడల్ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. 221మంది దరఖాస్తు చేసుకోగా 209మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాన్ని మోడల్ పాఠశాలల డిప్యూటీ డైరెక్టర్ ఎన్‌వీ రవిసాగర్, ఎంఈవో బ్రహ్మేశ్వరరావులు తనిఖీచేశారు. పరీక్షలు జరుగుతున్న తీరును ప్రిన్సిపాల్ రవినాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రంలో వసతులను పరిశీలించారు.



ఈపూరులో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

● ఈపూరు: ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలు సోమవారం స్థానిక ఆరో తరగతి ప్రవేశం కోసం 95మంది దరఖాస్తు చేసుకోగా 94మంది పరీక్షలు హాజరైనట్లు ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ సునీల్ చౌదరి తెలిపారు. మే నెల రెండో వారంలో ఫలితాలు ప్రకటించడం జరుగుతుందన్నారు.

చిలకలూరిపేటలో అగ్నిప్రమాదం

రూ. 10 లక్షల ఆస్తి నష్టం



అగ్ని ప్రమాదం జరిగిన దుకాణం

చిలకలూరిపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుభానీనగర్‌లో ఒక షాపింగ్ కాంప్లెక్స్‌లో సోమవారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో చిన్న పిల్లల ఆట బొమ్మలను విక్రయించే ఒక దుకాణం పూర్తిగా దగ్ధమైంది. స్థానిక అగ్నిమాపక కేంద్రం సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలు పక్క దుకాణాలకు వ్యాపించకుండా సకాలంలో మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో సుమారు రూ.10లక్షల మేరకు ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చునని అంచనా వేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. ఉదయం దుకాణం మూసి ఉన్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. దుకాణంలో నుంచి వస్తున్న పొగలు చూసిన స్థానికులు సమాచారాన్ని స్థానిక అగ్నిమాపక కేంద్రానికి తెలియచేశారు. చిలకలూరిపేట తహసీల్దార్ హుస్సేన్, కమిషనర్ శ్రీహరిబాబు, పోలీసులు సంఘటన జరిగిన ప్రదేశానికి వచ్చి పరిశీలించారు.

ప్రకృతి వ్యవసాయంతో సాగుకు తక్కువ పెట్టుబడి

● డీఎంఎంపీ మల్లీశ్వరి

నాదెండ్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం చేయటం ద్వారా సాగుకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని డీఎంఎంపీ మల్లీశ్వరి అన్నారు. చిరుమామిళ్ళ గ్రామంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ర్యాలీ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయటంతో భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. తొలకరికి ముందే పీఎండీఎస్ వేయటం ద్వారా భూమిలో కార్బన్ శాతం పెరగటంతో పాటు వాన పాములు వృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ సాగి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.